ప్రజాశక్తి

snehaweekly.praja@gmail.com

ఆ లవ్

చాలా కాస్ట్లీ గురూ!

'ఆ చెయ్యి ఇలా ఇవ్వు ప్రిటీ డియర్...'

'ఇప్పటికి తొమ్మిదేళ్లుగా ప్రేమించుకుంటున్నాం...పెళ్లి కూడా చేసుకున్నాం.. ఇంకా చెయ్యి, కాలూ అంటావేమిటి ఏంజెల్ డియరెస్ట్...'

'ఆ ప్రేమ మనకిద్దరికే సంబంధించింది.. అలాగే ఈ బహుమానం కూడా మన వ్యక్తిగతం.. నా మనోగతం.. నీకే అంకితం...'

'ఆ మాట మళ్లీ మళ్లీ చెప్పాలా ఏంజెలినా.. డైలీ మెయిల్, సన్, అన్నిట్లో ఆ వార్తలే కదా.. నీవు నన్నెంత గాఢంగా లవ్వాడుతున్నావో...'

'ఏమిటో డియర్ ఈ మీడియా వాళ్లు ఎంత వద్దనుకున్నా వెంటాడి అన్నీ తెలుసుకుని బయిట పెట్టేస్తుంటారు..'

'యా.. యా.. ఆల్వేస్ న్యూసెన్స్. మొన్న మనం ఆరుగురు పిల్లల్నీ... ఇంట్లో వదలి లేక లేక బ్రేకు తీసుకుని వెళితే ఫోటోలతో సహా వేశారా?'

'అఫ్‌కోర్స్.. ఫోటో యాంగిల్స్ బాగానే వున్నాయి గాని.. బ్యాగులన్నీ నీవే మోసావనీ, నేను వూరికే హ్యాండ్బాల్ వూపుతూ వచ్చానని కూడా కామెంట్ చేశారు డీ.. అంతకు ముందు నేనో ద్వీపం కొన్నా ఇదే గోల.. ఎలా చచ్చేది..'

'అదే కదా... నీవు ఏదో వజ్రాల షాపుకు వెళ్లి నా కోసం అరుదైన స్విస్ వాచి కొన్నావనీ రాసేశారు కదా.. అంతకు ముందు హాంకాంగ్ ట్రిప్‌లోనూ రెండున్నర లక్షల డాలర్ల వజ్రాలు కొన్నామని స్టోరీలు. ఇట్స్ టాకింగ్ యార్..'

'నేనెంతో సస్పెన్స్‌తో నీకు ఇవ్వాలని ఈ సినిమాలో మన పాత్రల పేర్లు కూడా రాయించాను డియర్. 'టు రోలీ ఫ్రం నెస్సా..' అని. మీడియా నిండా ఆ వార్తలేనా ఇంకేం లేనట్టు...'

◆ మనలో మాట

'యా.. యా..! అవి మనిద్దరం నటిస్తున్న 'డ్రామా బై సీ' సినిమాలో హీరో హీరోయిన్ల పేర్లు అయినంత మాత్రాన నీవే డైరెక్టరని తెలిసినంత మాత్రాన రాసేయడమేనా. అస్సలు మనకు ప్రైవసీ అంటూ లేకుండా పోతుందే...'

'ఈ వాచి ఖరీదు మూడు లక్షల డాలర్లని కూడా రాశారు పిట్ డియర్...'

'అయినా ఏంజెల్ నా ఆస్తి 245 మిలియన్ల డాలర్లు. నీదేం తక్కువనా 145 మిలియన్ల డాలర్లు.. మనకిదో లెక్కా...'

'అలా తీసేయలేరు కదా ప్రిట్.. మన రేంజికి మామూలైనా వారికి కళ్లు తిరక్కపోతే ఇంత శ్రమ పడతామా?.'

'కరెక్ట్. ఇండియాలో అంబానీ వాళ్లావిడ నీతూకి 175 ఫ్లోర్ల భవనం కానుకగా ఇస్తే కూడా ఇలాగే గొడవ చేశారే..'

'ఆయన వ్యాపారంలో వున్నాడు మనదేమో షో బిజినెస్.. సెలబ్రటీలకు ఈ న్యూసెన్స్ తప్పదేమో ప్చ్.. ఏం చేస్తాం...'

'కరీనా కపూర్ సైఫలీఖాన్‌లకే కళ్లుతిరిగిన వారు మన గిఫ్ట్‌ల ధాటికి ఎక్కడ ఆగుతారులే పాపం...'

'ఔను డియర్.. మన గురించి వాళ్లు చెప్పుకోవాలంటే మీడియాలో ఇలాంటి కాస్ట్లీ కబుర్లు కథలూ రావాల్సిందే.. అందుకోసం ప్రైవేసీ త్యాగం తప్పదు కదా...' మరి చేయి అందించవా! నా లవ్ ఎంత కాస్ట్లీనో చెప్పేస్తా...'

'ఇదిగో.. థాంక్యూ వేరీ మచ్..'

'మీ కోసం మా సెలబ్రెటీలం ఎన్ని వేషాలు వేయాలో చూశారుగా. ఇక బయిలుదేరండి.. మా షూటింగుకు టైమైంది.. ఔను ఈ కెమెరా వాడింకా రాలేదే??'

❄



టపా

కష్టాలు తీర్చింది

ఆ గ్రామాన్ని కారు చీకట్ల భయాందోళనల నుంచి పండు వెన్నెల ఆనందంగా మార్చేసింది గ్రీన్ పీస్ అనే స్వచ్ఛంద సంస్థ. కొన్ని స్వచ్ఛంద సంస్థలు కేవలం పేరు చెప్పుకోవడానికి పనికొస్తాయి... పరిమితమౌతాయి. కానీ గ్రీన్ పీస్ సంస్థ బీహార్‌లోని ధర్నాయ్ గ్రామాన్ని వెలుగులతో నింపింది. నిజం చెప్పుకోవాలంటే ఇప్పటికీ విద్యుద్దీపాల వెలుగులకు నోచుకోని గ్రామాలు చాలానే ఉన్నాయి. కరెంటు లేకపోవడం వల్ల చదువుకే కాదు.. ఇతరత్రా అనేక పనులకు ఆటంకాలు ఏర్పడతాయి. ఒక్కోసారి ప్రమాదవశాత్తూ ప్రాణాల్ని సైతం కోల్పోవాల్సి ఉంటుంది. ఏది ఏమైనాగానీ గ్రామ మార్పుకు తోడ్పాటునివ్వటం మెచ్చుకోదగ్గది. ఇలాంటి మరిన్ని అంశాలను ప్రతివారం ఇవ్వాలని కోరుకుంటున్నాం.

ఆర్. వెంకటేశ్వరరావు, గుంటూరు.

ఆచరణతోనే ...!

ఆడపిల్లలకు కట్నం ఇవ్వాలన్న కారణంతో కడుపులో బిడ్డను కడుపులోనే చంపేస్తున్నారు. అలాంటి వరునికిచ్చే వరకట్నానికి వ్యతిరేకంగా ఓ గ్రామం ఉండడం విశేషం. అది కేరళలోని నీలాంబర్ గ్రామం. ఇది చదువుతుంటే మన రాష్ట్రంలోనూ ఉంటే బాగుంటుంది కదా! అనుకోకుండా ఉండలేం. రోజూ ఇలాంటివెన్నో చూస్తుంటాం.. వింటుంటాం... కానీ ఆపేందుకు ప్రయత్నాలు శూన్యం. ఇది ఒక్క ఈ తరంతోనే పోకుండా భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలబడానికి కృషి చేసేలా అక్కడివాళ్లు ప్రయత్నిస్తుండడం గొప్ప విషయం. అందుకే పెద్దలు అనేది టన్నులకొద్దీ ఉపన్యాసాల కన్నా కూడా.. చెంచాడు ఆచరణ చాలా గొప్పదని..!

ఎస్. సురేష్, పశ్చిమగోదావరి.

ప్రశాంతత

ఈ వారం మీరు ఇచ్చిన దత్తత వివరాలు చదివించాయి. ఇప్పటిదాకా ఎవరైనాగానీ తెలిసిందేమంటే.. పిల్లల్ని మాత్రమే దత్తత తీసుకుంటారు.. తీసుకోవడం జరుగుతుంది అని. కానీ ఒక్క పిల్లల్నే కాకుండా మొక్కలను, జంతువులను, మ్యూజియంలు, పక్షులు ఇలా మన చుట్టూ ఉన్నవాటిని దత్తత తీసుకొని వాటి సంరక్షణ కోసం కృషి చేయడం వల్ల మానసిక సంతృప్తికి లోనవుతారనడంలో సందేహానికి తావు లేదేమో!

ఎ. రాజు, హైదరాబాద్.

ఇంకానా?

వింతలోకంలో ఇచ్చిన కుక్కతో కళ్యాణం మూఢనమ్మకాలకు ప్రతీకగా నిలుస్తుంది. నిజంగా భర్త ఆయురారోగ్యాలతో ఉండాలంటే శునకం పక్కన కూర్చొని పెళ్లి చేసుకుంటే సరిపోతుందా...? ఒకవేళ అలా పెళ్లి చేసుకొని ఆ తర్వాత భర్త ఆరోగ్యవంతుడు కాకపోతే...? ఆ అమ్మాయి పరిస్థితి ఏంటి? రెండుసార్లు పెళ్లి చేయాలంటే.. అదేనండీ.. ఉత్తుత్తి పెళ్లికి, నిజం పెళ్లికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయి.. వామ్మో ఇది అనుకుంటేనే వారి తల్లిదండ్రుల కష్టసుఖాలు కళ్లెదుట కనిపిస్తున్నాయి. నిజం చెప్పుకోవాలంటే ఇలాంటి మూఢనమ్మకాలున్నంత వరకూ కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఎప్పటికీ మెరుగుపడదనేది సత్యం. ఇక శునక కేశాలతో పర్సు సరేసరి..! అలాగే మార్స్ ముంగిట్లో మామ్ గురించిన సమాచారం సమయానికి అందించారు.

శిరీష, వైజాగ్.

ఈ సంచికలో....

సిరుల సింగపూర్

కవర్‌స్టోరీ 14

చంద్రబాబు నాయుడి కలల దేశం - సింగపూర్
కెసిఆర్ కలవరిస్తున్న దేశం - సింగపూర్
మోడీ మాట్లాడుతున్న దేశం - సింగపూర్
పాలకులంతా జపిస్తున్న దేశం - సింగపూర్
అభివృద్ధికి మారు పేరుగా చెబుతున్న దేశం - సింగపూర్
ఇంతకీ సింగపూర్‌లో ఏముంది? పరిమిత వనరులే ఉన్నా.... అగ్రగామిగా ఎలా నిలవాలో సింగ పూర్‌ను చూస్తే తెలుస్తుంది. చాలాచాలా తక్కువ భూమివున్నా.... దేశ ప్రజలందరికీ ఇళ్లు ఎలా నిర్మించవచ్చో సింగపూర్‌ను చూస్తే తెలుస్తుంది.

మార్పు	4
ఆటలతో అభివృద్ధి	
వింతలోకం	6
గడ్డం అడ్డం కాదు	
కథ	8
గురుదక్షిణ	
జ్ఞాపకాలు	11
కళ నా శ్వాస	
పెద్దల అమెరికా యాత్ర	12
సీరియల్	18
ప్రేమ- విప్లవం	
కొత్త పుస్తకాలు	20
ప్రపంచీకరణ - సంస్కృతి	
రుచి	21
పుదీనాతో పసందు	
బాలనేస్తాలు	22
సవమ్‌థింగ్ స్పెషల్	24
పంటికి పాచి, ఒంటికి మురికి బలమా?	

సందర్భం 6

వెంటాడే జ్ఞాపకాలు
చే వర్ధంతి సందర్భంగా...

◆ ప్రత్యేకం

రాత్రి 7.00 గంటలు అయ్యిందంటే చాలు! టీవీ దగ్గరకు చేరిపోతుంటారు కొందరు తమిళవాసులు. లేకుంటే తమ అభిమాన న్యూస్ రీడర్ చదివే వార్తలు మిస్సయిపోరూ! ఆ పది పదిహేను నిమిషాలు... ఎంతో శ్రద్ధగా కూర్చుని న్యూస్ బులిటెన్ విని... ఎవరి పనుల్లోకి వారెళ్లిపోతుంటారు.

బుల్లితెరపై విరిసిన 'పద్మం'

బాలీవుడ్, హాలీవుడ్ తారల మాదిరిగా అభిమానులను పొందడమే కాక మీడియా రంగ నిపుణుల మన్ననలనూ పొందిన న్యూస్ రీడరే పద్మిని ప్రకాష్. సరిగ్గా ఆగస్టు 15వ తేదీన లోటస్ న్యూస్ చానల్‌లో యాంకర్‌గా చేరింది. స్వల్ప వ్యవధిలోనే అంతమంది ఆదరణ పొందడానికి కారణం? మాటలోని స్పష్టత, అర్థవంతంగా వాక్యాలను విడగొట్టి చదివే తీరే. అయితే అందుకోసం ఆమె ఎంతో కష్టపడుతుంది. సాధన చేస్తుందట. ఇందరి అభిమానాన్ని, అభినందనలను అందుకునేందుకు ప్రధాన కారణమైంది. న్యూస్ చానల్ ఛైర్మన్ జికెఎస్ సెల్వ కుమార్ కూడా అదే చెప్తారు. అయితే అన్నిటినీ మించిన విశేషం మరొకటి వుంది. ఆమె న్యూస్ రీడర్ అయిన తొలి ట్రాన్స్‌జండర్. విధుల్లో చేరడానికి ముందు ఎంతగానో కంగారుపడ్డారు పద్మిని. ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలనో, లేదోనని భయపడ్డారు. కానీ...మొదటి నుంచీ చక్కగా వార్తలు చదివే వారిపై గల అభిమానంతో ఆమె న్యూస్ బులిటెన్లను బాగా వినేవారట. అదే ఇప్పుడు ఉపయోగపడింది. దానికితోడు స్వయం సాధన తోడవడంతో నల్లేరుపై నడకే అయ్యింది.

ఈ విజయగాథ చదువుతూ వుంటే సంతోషం వేసినా...అదంత సులభంగా వచ్చిపడలేదు. దాని వెనక ఎన్నో కష్టాలు, ఎంతో కృషి, పట్టుదల దాగి వున్నాయి. కోయంబత్తూర్‌లోని ఆర్.ఎస్.పురంలో పద్మిని పుట్టి పెరిగింది. పదమూడేళ్లకే తను అందరిలాంటి మగపిల్లాణ్ణి కానని గుర్తించింది పద్మిని. పైగా చిన్నతనం నుంచీ తనకు చక్కగా అలంకరించుకోవడమే చెప్పలేనంత ఇష్టం. అందునా ఆడపిల్లల బట్టలు వేసుకోవడమంటే ఆసక్తి. నేస్తాల్లో కూడా మగ పిల్లలకంటే ఆడపిల్లలే ఎక్కువగా వుండేవారు. ఇదంతా సహించలేని పెద్దలు ఆమెను కుటుంబం నుంచి బహిష్కరించారు. అప్పుడామెకు పదహారేళ్లుంటాయేమో. కుటుంబంతో అంతంత మాత్రంగా వున్న బంధం కూడా తెగిపోవడంతో రాష్ట్రం దాటి... ఎక్కడెక్కడికో వెళ్లింది. ఇది ఒక్క పద్మిని విషయంలోనే కాదు. ఇలాంటివారికి సమాజం నుంచి అందేది అదే. దాంతో... తన మనసుకు ఊరటనిచ్చే మనుషుల కోసం, మాట కోసం... గాలించింది. చివరికి భరతనాట్యం శిక్షకురాలిగా తిరిగి స్వరాష్ట్రం చేరుకుంది.

పద్మిని నర్తకి మాత్రమే కాదు! ఆమెలో అనేక పార్శ్వాలున్నాయి. లింగమార్పిడి చేయించుకున్న వారి హక్కుల కోసం, వారిపై జరిగే దాడులకు, వివక్షకు వ్యతిరేకంగా గళం విప్పింది. పోరాడింది. అనేక చోట్ల జరిగిన అందాల పోటీల్లో పాల్గొని అందాల కిరీటాలెన్నో పొందింది. 2007లో ట్రాన్స్‌జండర్ విభాగంలో మిస్ తమిళనాడుగా ఎంపికైంది. 2009లో మిస్ ఇండియా ట్రాన్స్‌జండర్‌గా స్థానం దక్కించుకుంది.

పద్మిని విషయంలో ఇన్ని ప్రత్యేకతలున్నా... మొదటి నుంచీ వీరికి సమాజంలో స్థానమే లేదు. భాగస్వామ్యం అంతకంటే లేదు. హక్కుల ఊసే లేదు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో సుప్రీంకోర్టు తీర్పు వెలువడ్డాక పరిస్థితిలో కొద్దిగా మార్పు వచ్చింది. లింగమార్పిడి చేయించుకున్న వారిని థార్డ్ జెండర్‌కు చెందినవారిగా చూడాలని, వారికీ సమాన హక్కులివ్వాలని స్వయంగా అత్యున్నత న్యాయస్థానం చెప్పాక తప్పదుకదా. అలా మొదటి సారిగా పద్మిని ప్రకాష్ న్యూస్ రీడర్‌గా అవకాశం పొందింది.



న్యూస్ బులిటెన్ చదివేందుకు పద్మిని సిద్ధమయ్యే తీరు తోటి ఉద్యోగులను కూడా అబ్బురపరుస్తుంది. ఎంతో ముచ్చటగా చీర కట్టుకుని, లిప్‌స్టిక్ పూసుకుని, తల దువ్వుకొని, పూలు పెట్టుకుని అచ్చమైన తమిళ ఆడపడుచులా తయారౌతుంది. ఇదంతా తన సెల్‌ఫోన్‌లో సంగీతం వింటూ, కూనిరాగాలు తీస్తూ చేస్తుంది. వార్తలు కూడా అంతే అందంగా చదివి అభిమానులను అలరించే పద్మిని తనలాంటి వారి గురించి ఇలా చెప్తుంది.

“ఇప్పటికీ మా వాళ్ల పరిస్థితి బాధాకరంగానే వుంది. వీధుల్లో కనిపిస్తే చాలు ఒకరకమైన చీదరింపు వ్యక్తమౌతుంది జనంలో. కానీ మేం కూడా మనుషులమే. మమ్మల్ని తేడాగా ఎందుకు చూస్తారు?” అని ఆవేదనతో ప్రశ్నిస్తోంది. ఆ వెంటనే...“మొదట్లో మమ్మల్ని ఎవరైనా వేధిస్తే ఎవ్వరూ ప్రశ్నించేవారే కాదు. పోలీసులు స్పందించే వారు కాదు. ఇప్పుడలా లేదు. చాలా మంది సాయం చేస్తున్నారు. నేను వార్తలు చదివాక రోడ్డుమీద తలెత్తుకుని నడవగల్గుతున్నాను. అదిగో వార్తలు చదివే అక్క అంటున్నారు చిన్నారులు...” అంటోంది సంతోషంగా పద్మిని. ఆమె మాటల్లో ఓ వైపు తన వాళ్ల గురించిన బాధ...తనకు లభిస్తున్న గుర్తింపు గురించి ఆనందం వ్యక్తం కావడం గమనించాలి.

పద్మిని గురించి పూర్తిగా తెలిసిన ప్రకాష్ ఆమెను పెళ్లాడాడు. ఇద్దరూ సంతోషంగా ఓ బాబుని దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. తల్లిగా, ఉద్యోగినిగా జీవితం బాగుందంటోంది పద్మిని ఆనందంగా...! ఎంతో వివక్ష, ఎన్నో వేధింపుల అనంతరం అందిన సంతోషమిది. పద్మిని చెంత పదిలంగా వుండాలని కోరుకుందామా!

❄

ఆటలతో అభివృద్ధి

చదువు లేకపోవడం, దురలవాట్లు, బాల్య వివాహాలు, బాలికా భ్రూణహత్యలు, అత్యాచారాలు, చిన్నతనంలోనే నేరాలు... మురికివాడల్లో, వెనుకబడిన గ్రామాల్లో, నగరాల్లో అడుగడుగునా కన్పిస్తాయి. వాటికి బలయ్యేది అమాయక చిన్నారులు, యువతీయువకులే. మరి ఆ మహమ్మారులనుంచి వారిని కాపాడే మార్గమే లేదా? అంటే! 'వుంది. అది ఆటల ద్వారానే' అంటున్నాయి కొన్ని స్వచ్ఛంద సంస్థలు. ఈ సామాజిక సమస్యలపై పోరాడ్డానికి ఆటలను సాధనాలుగా ఎంచుకున్న తీరు...సాధిస్తున్న విజయాలు... ఈవారం మీకోసం.

బర్మాంజి చిన్నారులు

మేజిక్ బస్ చిన్నారులు

'నాజ్' క్రీడాకారులు

ఫుట్‌బాల్‌తో బాల్యవివాహాలకు చెక్!

జార్ఖండ్! దేశంలోకెల్లా అత్యంత పేద రాష్ట్రాల్లో ఒకటి! ఇక్కడి గిరిజనుల బతుకుల గురించి చెప్పేదేముంది? అలాంటి చోట ... పద్దెనిమిది మంది గిరిజన బాలికలు ...ఎక్కడో స్పెయిన్‌లో జరిగిన గేస్టైజ్ కప్ పోటీల్లో (2013) పాల్గొని ... కాంస్య పతకం సాధించడం చిన్న విషయమా చెప్పండి. వారిని అంతగా ప్రోత్సహించి ముందుకు నడిపిన ఘనత 'యువ ఇండియా'దే. అంతర్జాతీయంగా పద్నాలుగు జట్లు పాల్గొన్న ఈ పోటీలో బర్మాంజి అనే మారుమూల గ్రామానికి చెందిన గిరిజన పిల్లలు మూడవ స్థానంలో నిల్చారు. ఆ విషయాన్ని అధికారులు ప్రకటించిన వెంటనే ... తమ వెంట తెచ్చుకున్న స్థానిక సంప్రదాయ చీరలు కట్టుకుని, పూలు పెట్టుకుని వేదిక మీద చేతులు ఊపారు ఈ చిన్నారులు విజయచిహ్నంగా.

అయితే ఈ విజయం అంత తేలిగ్గా వచ్చిపడలేదు. నిజానికి జార్ఖండ్ రాష్ట్రంలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతాయి. జాతీయ కుటుంబ సర్వే 2005–2006 వివరాల ప్రకారం సుమారు యాభై శాతం అమ్మాయిలకు (20–25ఏళ్ల లోపువారు) పద్దెనిమిదేళ్లు వచ్చేసరికే పెళ్లిళ్లు అయ్యాయి. పైగా వారికి చదువు వుండదు. చిన్నవయసులోనే వివాహబంధంలోకి రావడంవల్ల ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. వీటన్నిటి నుంచి బాలికలను, మహిళలను బైటపడవేసేందుకు తన వంతు ప్రయత్నం చేయాలని 'యువ ఇండియా' కంకణం కట్టుకుంది. అందుకు ఫుట్‌బాల్ ఆటను సాధనంగా ఎంచుకుంది. ఫుట్‌బాల్ ఆటను నేర్పించేందుకని గ్రామాల్లోని గిరిజన బాలికలను సమీకరించింది. వారికి ఆటలతో పాటుగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించి చైతన్యవంతులను చేసింది. పనిలోపనిగా వారి పెద్దలకూ ఈ విషయాలను అర్థమయ్యేలా వివరించింది. ఇందుకోసం పదే పదే వారితో మాట్లాడడం ... వారాంతాల్లో తరగతులు నిర్వహించడం చేసేదా సంస్థ. అలా ఇప్పుడా అమాయకపు గిరిజనుల్లో చైతన్యం... స్వంత కాళ్లమీద గౌరవంగా బతకాలన్న తపన, చదువుకోవాలన్న పట్టుదల కలిగాయి. బాల్యవివాహాల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతోంది.

ఆటలతో దురలవాట్లకు దూరం

నగరాల్లో...అందునా ఢిల్లీ వంటి చోట వీధి బాలలకు, పేదింటి పిల్లలకు దురలవాట్లతో వున్నంత చెలిమి మరి దేనితో వుండదేమో! వాటికి అలవాటు పడిన చిన్నారులు నేరాలు చేయడానికి వెనకాడరు. ఇంక ఆ తర్వాత వారికోసం ... జువెనైల్ జైళ్లు తెరిచే వుంటాయి. ఇదో దుర్భర జీవితం. వీరి బతుకుల్లో వెలుగులు తీసుకురావడానికి ఫుట్‌బాల్‌ను సాధనంగా ఎంచుకుంది 'ది ఫుట్‌బాల్ లింక్' అనే సంస్థ. పోలీసులు నడిపే 'యువ ఫౌండేషన్'తో కలిసి 'చైల్డ్ అండ్ యూత్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'ని చేపట్టింది. దీని ద్వారా చిన్నారులు, యువతలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. వీరికి చదువుకునేందుకు, సొంత కాళ్ల మీద బతికేందుకు అవకాశం కల్పించింది. అయితే ఫుట్‌బాల్ ఆటను ఎరగా వేసే...చిన్నారుల మనసు దోచుకున్నారు. ఆట కోసం సమీకరించిన పిల్లలు, యువతకు... నైతిక, సామాజిక విలువలను ఉద్బోధించి... సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా వుండేలా చేశారు. ముందుగా కొన్ని ఎంపిక చేసుకున్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో చేపట్టిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలనిచ్చింది.

నెట్‌బాల్‌తో సాధికారత

ఆడైనా మగైనా గౌరవ ప్రదమైన జీవితం గడపాలంటే ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం, అక్షరజ్ఞానం అవసరం. వీటన్నిటతోపాటు ఆర్థిక స్వావలంబనా అవసరం. అయితే పేదలకు ఇవన్నీ అందేదెలా? వాటిని నేర్చుకునేదెలా?

అసలు వాటిని నేర్పేదెవరు? వారిని బాగుచేయాలని చూసేదెవరు? అన్న సందేహాలు కలుగుతాయి. ఢిల్లీకి చెందిన 'నాజ్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ అందుకు నెట్‌బాల్‌ను సాధనంగా వాడుకుంది. ఢిల్లీ, చెన్నై, ముంబై, వంటి రాజధాని నగరాల్లోని మురికివాడల్లో నివసించే చిన్నారులు, యువతను లక్ష్యంగా చేసుకుని పని ప్రారంభించింది. వారికి నెట్ బాల్ నేర్పిస్తూనే... ఆరోగ్యం, పరిశుభ్రతల గురించి వివరించే కార్యక్రమాలు చేపట్టింది. ఆత్మవిశ్వాసం పెంపొందేలా, సొంత కాళ్ల మీద నిలబడి బతకగలిగేలా శిక్షణ నిచ్చింది. 2006లో ప్రారంభమైన ఈ సంస్థ ఇప్పటికి వేలాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చింది.

మేజిక్ బస్

ఆటపాటల ద్వారా బీదపిల్లల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న స్వచ్ఛంద సంస్థ 'మేజిక్ బస్'. ప్రస్తుం ఈ సంస్థ పన్నెండు రాష్ట్రాల్లో పని చేస్తోంది. మురికివాడలకు చెందిన పిల్లలను ఆటలతో చదువు వైపు మళ్లించడం, జీవికకు ఉపయోగపడే అనేక అంశాలపై శిక్షణ ఇవ్వడం, ఆరోగ్యం గురించి... ఆడమగ సమానత్వం గురించి...తెలియచేయడం ఈ సంస్థ ప్రధాన కార్యక్రమం. దేశవ్యాప్తంగా వేలాది మంది చిన్నారుల జీవితాల్లో సంతోషం నింపుతోంది.

ఆత్మరక్షణకై మేరీ కోమ్ క్యాంపు

వయోబేధం లేకుండా పసిపిల్లల నుంచి వయసు పైబడిన మహిళల వరకు ఎంతమందిపై అత్యాచారాలు జరుగుతున్నాయో చూస్తూనే వున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో బాలికలకు, మహిళలకు ఆత్మరక్షణ తెలిసివుండడం ఎంతైనా అవసరం. అందుకు ప్రసిద్ధ బాక్సర్ మేరీకోమ్ ఇటీవలే ఒక క్యాంపును ప్రారంభించింది. ఇది అచ్చంగా మహిళల కోసం ఏర్పాటు చేయబడింది. భయం, హింసపై పోరాడ్డానికి ఆడవాళ్లకు కావాల్సిన శక్తిని ఇచ్చేందుకు, మెళుకువలు నేర్పేందుకు ఈ క్యాంపును నిర్వహిస్తోంది మేరీకోమ్. దీనివల్ల మహిళలు పురుషులకంటే ఏమాత్రం తక్కువకాదని వారు అర్థం చేసుకునే అవకాశముంది.

ఆటలతో ఆరోగ్యం

ఆరోగ్య సూత్రాలను పసితనం నుంచే నూరిపోయడం ఎంతైనా అవసరం. మరీ ముఖ్యంగా పేద ప్రాంతాల్లో...గ్రామాల్లో...రాష్ట్రాల్లో. పరిశుభ్రత ఆరోగ్యానికి తొలి మెట్టని తెలిస్తే కదా శుభ్రంగా వుండేది. అదే పనిని చేపట్టింది యునిసెఫ్. ఛత్తీస్‌గఢ్‌లో. అక్కడ జరిగిన హింసాత్మక ఘర్షణల ప్రభావానికి గురైన చిన్నారులను తిరిగి మామూలు స్థితిలోకి తీసుకురావడానికి.. ఆటలను సాధనంగా ఎంచుకుంది. అలా సుక్మా జిల్లాలో 'స్పోర్ట్స్ ఫర్ డెవలప్ మెంట్' అనే కార్యక్రమాన్ని చేపటింది. ఆటలు ఆడాక చేతులు కడుక్కోవడం ఎంత మంచి అలవాటో, దానిలో దాగిన ఆరోగ్య రహస్యమేంటో కూడా వారు నేర్చుతారు. అలా ఆటల తర్వాత చేతులు కడుక్కోవడమనేది చాలా మామూలు అలవాటుగా మారిపోతోంది. వారికి వ్యాయామ విద్య నేర్పడం, ఆగిపోయిన చదువును కొనసాగించేలా చేయడం ఆ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా వున్నాయి. ఒక్క సుక్మాలోనే కాకుండా సమస్యాత్మక ప్రాంతాలన్నింటా ఈ విధమైన కార్యక్రమాలు చేపట్టాలని చూస్తోంది యునిసెఫ్. ★

మేరీకోమ్ శిక్షణ

స్పోర్ట్స్ ఫుట్‌బాల్ లింక్ క్రీడాకారులు

'యువ ఇండియా' ఆటగాళ్లు

◆కార్టూన్ కదంబం









సందర్భం

ప్రవహించే ఉత్తేజం చే గువేరా! క్యూబాలో ఎక్కడ అడుగు పెట్టినా చే జ్ఞాపకాలు పలకరిస్తూనే ఉంటాయి. అతనికి చెందిన ప్రతి చిన్న వస్తువూ క్యూబన్ ప్రజలకు అపురూపమైనదే. మత ప్రసక్తి లేని ఆ దేశంలో చే గువేరా వస్తువుల్ని దాదాపు పూజనీయమైన చిహ్నాల్లా ఆరాధిస్తారంటే అతిశయోక్తి కాదు. ఈ భావనకున్న మూలాలు మాత్రం పూర్తిగా భౌతికమైనవే. ఆ దేశ విముక్తి కోసం అతడు ప్రాణాలను పణంగా పెట్టాడు. ఆ ప్రజల జీవితాల్లోకి వొక్కక్క సౌకర్యాన్ని సమకూర్చటం కోసం అతడు కనీసావసరాలను కూడా వొదులుకుని శ్రమించాడు. క్యూబా విప్లవ చరిత్రలో, ప్రజల సంస్కృతిలో, చే వేసిన ముద్ర చెరిగిపోయేది కాదు.

వెంటాడే జ్ఞాపకాలు

బతికినంత కాలం... తనకంటూ ఏ ఆస్తులూ కూడబెట్టుకోని వ్యక్తి చే గువేరా. మరణానంతరం అతనికి చెందిన ప్రతి వస్తువూ అతి విలువైన సంపదగా మారిపోవటం చిత్రమైన విషయమే. హవానాలోని 'వెర్దే ఆలివో' ఆఫీసులోకి వెళ్లగానే ఓ చిన్న అద్దాల పెట్టెలో భద్ర పరిచే చే గువేరా కెమెరా కనబడుతుంది. దాన్ని చూస్తూ తల పైకెత్తగానే ఎదురుగా వున్న ఫొటోలోంచి నవ్వుతూ పలకరిస్తాడు చే.

కాబైగ్యువాన్ పట్టణంలో చే గువేరా పేరిట ప్రత్యేకమైన మ్యూజియం ఏర్పాటయింది. క్యూబన్ విప్లవోద్యమంలో అతను గాయపడినప్పుడు చేతికి వేసుకున్న బ్యాండేజీ నుండి బొలీవియాలో శత్రువులు కోసి వేసిన అతని చేతుల దాకా ఆ మ్యూజియంలో భద్రపరిచారు. 'మ్యూజియం ఆఫ్ ది రివల్యూషన్'లో బొలీవియన్ పోరాటంలో పాల్గొన్న గెరిల్లాలకు చెందిన వస్తువులన్నీ కన బడతాయి. చే వేసుకున్న ఆలివ్‌గ్రీన్ యూనిఫాం, చిరుగుల బూట్లూ, పీలికలైన సాక్సూ, బొలీవియా యుద్ధంలో విరిగిపోయిన తుపాకీ, గెరిల్లా యుద్ధతంత్రాన్ని రచించిన పార్కర్‌పెన్నూ, రిస్టువాచీ... ప్రతి వస్తువునూ క్యూబన్ ప్రభుత్వం సేకరించింది.

సియెర్రా ప్రాంతపు కంపెసినో కుటుంబాల వ్యక్తులను పలకరిస్తే వాళ్ల మనసు పొరల్లోని చే జ్ఞాపకాలను కథలుగా చెప్తారు. లీనా గొంజాలెజ్ అనే వృద్ధురాలు చే గెవారా తన ఇంటికి వచ్చినప్పుడు కూచున్న చిన్నబల్లనూ, కాఫీ తాగిన కప్పునూ ప్రాణపదంగా దాచుకుంది. లీనా లాంటి వ్యక్తులు ఇంకా ఎందరో ఆ పల్లెల్లో కనబడతారు.

బొలీవియాలోని లాహిగ్యూరా, వల్లెగ్రాండేల ప్రజలు చే గెవారా వ్యక్తిత్వం మీది ప్రేమను తమ మత విశ్వాసాల రూపంలోకి అనువదించుకున్నారు. రక్తంతో తడిసిన అతని చిరుగుల దుస్తులనూ, వెంట్రుకలనూ పవిత్ర చిహ్నాల్లా భద్ర పరచుకున్నారు. లాహిగ్యూరాలోని ఫొటోగ్రాఫర్ తీసిన చే మృతదేహపు ఫొటోలను ఇంటింటా పదిలపరుచుకున్నారు. పల్లెగ్రాండే ఆస్పత్రిలో చే దేహాన్ని శుభ్రపరిచిన నర్సు సుసానా ఒసినాగా జీవితాంతమూ అతని జ్ఞాపకాల్లోంచి బయటపడనే లేదు. 'చే ఎన్నోసార్లు నా కలలో కనబడతాడు. ఈ పాపపంకిలం నుంచి నాకు విముక్తి ప్రసాదిస్తానని వాగ్దానం చేస్తాడు' అని చెప్పేది తన క్రైస్తవ పరిభాషలో. ఇక అతని స్నేహితులూ, సహచరులూ అన్ని మర్చిపోలేకపోవటంలో ఆశ్చర్యం లేదు.

ఆత్మ బంధం

చే గువేరా క్యూబా నుండి వెళ్లేనాటికి చిన్న కూతురు సెలియాకు రెండేళ్లు కూడా నిండలేదు. కుటుంబ సభ్యులూ, స్నేహితులూ చెప్పే జ్ఞాపకాల్లోంచి తండ్రిని చూసుకోవటం తప్ప, అతని ముఖం లీలగానైనా ఆమెకు గుర్తుండే అవకాశం లేదు. 'బొలీవియన్ డైరీ చదువుదామని ఎన్నిసార్లు ప్రయత్నించినా భరించలేని దు:ఖం ముంచెత్తి మధ్యలోనే ఆపేస్తూ ఉంటాను' అని చెప్తుంది సెలియా.

చే జీవిత చరిత్రను రాసిన పాకో ఇగ్నేషియా తైబో – 2 అనే స్పానిష్ రచయిత 1995లో చే కుటుంబ సభ్యులనూ, సహచరులనూ ఇంటర్వ్యూలు చేశాడు. యూరో లోయలో దాడి నుంచి తప్పించుకున్న కొద్దిమందిలో దేరియల్ అలర్కాన్ కూడా వున్నాడు. తర్వాత క్యూబాకు వచ్చి నివసిస్తున్న అతను చే గెవారాను రక్షించుకోలేకపోయిన తను అశక్తతకు కుంగిపోతూనే ఉండేవాడు. 'సోషలిజానికి అచ్చమైన ఆచరణ చే జీవితం' అన్నాడు రేగిస్ దబ్రే. చే సెక్రటరీగా పనిచేసిన హెూసే మాన్యుయెల్ మన్రెసా 'చే లాంటి మనిషి మళ్లీ కనబడతాడేమోనన్న వెతుకులాట కోసమే బతుకుతున్నాను' అని చెప్పాడు కన్నీళ్లతో.

ఫైడెల్ జ్ఞాపకాల్లోనే కాదు – అతని జీవితమంతటిలోనూ చేవొక విడదీయరాని భాగం. 'చే నా కలల్లో తరచుగా కనబడుతూ ఉంటాడు. ఎన్నో కబుర్లు చెప్తాడు, చర్చిస్తాడు, వాదిస్తాడు...' అన్నాడు గియానీమినా అనే ఇటాలియన్ జర్నలిస్టుతో ఫిడెల్. చే రచనలు చదివి అతనికి గాఢమైన అభిమానులుగా మారిన వాళ్లు ప్రపంచవ్యాప్తంగా ఎందరో ఉన్నారు.

పచ్చి వ్యాపారం

అతనికి దొరికిన ఈ ప్రజాభిమానాన్ని సొమ్ము చేసుకునేందుకు బొలీవియా, యు.ఎస్. ప్రభుత్వాలు పోటీలు పడ్డాయి. యూరోలోయలో చేను పట్టుకున్న మర్నాటి నుండి అతని పేరిట వ్యాపారం మొదలయింది. చే దగ్గర దొరికిన పార్కర్ పెన్నూ, పెళ్లి ఉంగరమూ, ఫొటోలూ, పైపూ, విరిగిపోయిన రైఫిలూ, అన్నిటికీ నకిలీలను తయారు చేయించి పెద్ద మొత్తాలకు అమ్ముకున్నారు బొలీవియన్ అధికారులు. చివరికి పీలికలై తోలుముక్కల్లా వున్న అతని చెప్పులను కూడా వొదల్లేదు. ఇక, చే రిస్టువాచీకి ఎందరు యజమానులో లెక్కేలేదు. ప్రాదో హస్తగతం చేసుకున్న ఆ రోలెక్స్ వాచీ ఎన్నో చేతులు మారింది. దానికి వేలాది నకిలీలు తయారై అమ్ముడు పోయాయి. ఇలాంటి వ్యాపారాల్లో అమెరికన్ పెట్టుబడిదారులు నైపుణ్యాన్ని చెప్పనే అక్కర్లేదు. తమ మీది వ్యతిరేకతను కూడా వ్యాపార వస్తువుగా మార్చి సొమ్ము చేసుకోవటం అమెరికన్ సామ్రాజ్య వాదులకు వెన్నతో పెట్టిన విద్య. అమెరికాలో తయారైన చేగువేరా ఫొటోల పోస్టర్లూ, టీ షర్టులూ, పోస్టు కార్డులూ, కాఫీ మగ్గులూ మార్కెట్లను ముంచెత్తాయి. అతన్ని గురించి ఆడియో, వీడియో టేపులూ, సినిమాలూ, పుస్తకాలూ అమెరికన్ పెట్టుబడిదారులకు కనకవర్షం కురిపిస్తున్నాయి. క్యూబన్ ప్రభుత్వమూ, చే కుటుంబమూ ఈ వ్యాపారాన్ని నిరసిస్తూనే ఉంది.

(అక్టోబర్ 8 చే వర్ధంతి)

కెమెరా

చే నడిపిన బైకు

పది వేల పేపర్ విమానాలు

వాన పడిందంటే చాలు! పిల్లలు కాగితాలు పుచ్చుకుని రెడీ అయిపోతుంటారు. వాటితో పడవలు చేయడానికి. చేసి వాన నీళ్లలో వదలడానికి. చిన్నారులేనా! పెద్దలూ వారితో పోటీ పడడం చూస్తుంటాం. అయితే గ్జు షుక్వాల్ అనే చైనా మాష్టారు పేపర్ విమానాలు చేసి రికార్డు సృష్టించాడు. ప్రస్తుతానికి ఆయనకు 70 సంవత్సరాలు. ఆయన చేసిన విమానాల సంఖ్య ఎంతో తెల్సా! పదివేలు. టీచర్‌గా రిటైర్ అయ్యాక కూడా తన వ్యాపకాన్ని విడిచి పెట్టకుండా కొనసాగించాడు. అసలు ఈయనగారికి ఈ విమానాలు చేయాలన్న ఆలోచన ఎందుకు వచ్చిందనుకున్నారు? అదేనండీ స్కూల్లో అల్లరి పిల్లలు పేపర్ రాకెట్లు చేసి ఒకరి మీదకు ఒకరు విసురుకుంటూ వుంటారు కదా. అలా అల్లరి పిల్లల మీదకు మాస్టారు విమానాలు విసిరేవాడట. వారిని అల్లరి మాన్పించడానికి. పాఠాల వైపు మళ్లించడానికి. అలా రకరకాల పద్ధతుల్లో అనేక రకాల పేపర్ విమానాలు చేయడంలో మంచి దిట్టట ఈ మాష్టారు. పేపర్‌తో వస్తువులు, జంతువుల బొమ్మలు చేసే కళ ఒరిగామి గురించి తెల్సుకదా. అలా చైనాలోనూ ఝెఝి అనే ప్రాచీన కళ ఒకటి వుందట. ఎలాగైనా దాని ఉనికిని కాపాడాలన్నది మాష్టారి ప్రయత్నం.

కారుకు క్రిస్టల్ సొబగులు

కారు, ఆటో, సైకిల్...ఏదైనా సరే. తమ వాహనాలను అందంగా అలంకరిస్తుంటారు కొందరు. సైకిల్ చక్రాలు, రిమ్ములు, హ్యాండిళ్లు, సీటుకు అదనపు అలంకరణలు చేస్తుంటారు. మెరుపులు, పూసలు, సీడీలు...ఇలా చెప్పేదేముంది? చూస్తుంటారు కదా. ఆటోలు కూడా అంతే. రకరకాల రంగురంగుల పూలు, కాయలతో, తమ అభిమాన హీరోహీరోయిన్ల బొమ్మలతో అందంగా తీర్చిదిద్దుతుంటారు. కార్లకంటారా! తాహతును బట్టి అలంకరించేస్తుంటారు. తాజాగా వార్తలకెక్కిందో రష్యా అమ్మాయి. ఈమె తన కారుమీద 30,000 డాలర్ల విలువ చేసే క్రిస్టల్ రాళ్లను అతికించింది. ఇందుకు రెండున్నర నెలలు పట్టిందట. ఇప్పుడీ కారు అమెరికాలో ఎక్కడ కనిపించినా (ఈమె అక్కడ చదువుకుంటుంది లెండి) జనం విరగబడి

చూసేస్తున్నారట. కొందరైతే మధ్యలో ఆపి మరీ కారును పరిశీలిస్తున్నారు. ఎక్కడ పార్క్ చేస్తే అక్కడ తెగ ఫొటోలు తీసేస్కుంటున్నారు. మరో విశేషం ఏమంటే... ఎక్కడైనా ఒక రాయి రాలిపోతే...అతికించడం కోసం... చిన్న పర్సులో కొన్ని క్రిస్టల్స్ పెట్టుకుని తీసుకెళ్తోందట డారియా రాడియొనోవా. అదేనండీ మనం ఇప్పటి వరకు చెప్పుకున్న రష్యా విద్యార్థిని ఈమే.

గడ్డం అడ్డం కాదు

ఆడవాళ్లు...అనవసరపు వెంట్రుకలను వదిలించుకోవడానికి ఎన్నేసి తిప్పలు పడుతుంటారో చూస్తూనే వుంటాం. వీటికోసం ఎన్నో వేల కోట్ల రూపాయల వ్యాపారం నడుస్తోంది మార్కెట్లో. బ్యూటీ పార్లర్లు, క్రీములు, లోషన్లు...వగైరా వగైరా... వున్నాయి. ఎంతో సమయాన్ని కూడా ఇందుకోసం వెచ్చిస్తుంటారు. ముఖ్యంగా మొహం మీద ఒక్క వెంట్రుక కనిపించినా దాన్ని పెరికి పారేసేవరకు నిద్రపోరు. ఏతా వాతా చెప్పొచ్చేదేమంటే శరీరం మీద ఎక్కడా అనవసరపు కేశాలు లేకపోతేనే ఆడవాళ్లు అందంగా వున్నట్టు...సో కాల్డ్ మీడియా ప్రచారం చేస్తుటుంది. అయితే ఉజ్‌బెకిస్తాన్‌కు చెందిన ముక్తాబోర్ అనే 65 ఏళ్ల మహిళ ఇందుకు భిన్నంగా చెప్పుకోవచ్చు.

ఆమె తన 8 అంగుళాల గడ్డంతో హాయిగా జీవిస్తోంది. భర్త, ఇద్దరు పిల్లలు, 8 మంది మనవళ్లు, మనవరాళ్లతో సంతోషంగా గడిపేస్తోంది. 'నాకు ఈ గడ్డం ఎప్పుడూ అడ్డం కాలేదు. నిజానికి గడ్డం రావడం మొదలైన తొలి రోజుల్లో నాకు పెళ్లి అయింది. నేను మా ఆయనా సుఖంగా సంతోషంగా వున్నాం' అంటోంది ముక్తాబోర్. అయితే ఆమె చుట్టూ వున్న జనం మాత్రం వింతగానే చూస్తున్నారు. ఆమెతో ఫొటోలు దిగడం...వాటిని ఫేస్‌బుక్‌లో వుంచడం...మామూలైపోయింది. ఇందులో పురుషుల సంఖ్యా తక్కువ కాదట. ఎందుకంటే తమ ఆడవాళ్లకు ముక్తాబోర్ గురించి చెప్పడానికట.

★

గురు దక్షిణ

గోనుగుంట మురళీకృష్ణ
ఫోన్: 9701260448

జూన్ నెల వచ్చింది. తొలకరి వానలు కురిశాయి. ఎండలు తగ్గి వాతావరణం చల్లబడింది. రైతులు భూమి దున్నటం మొదలు పెట్టారు.

వేసవి సెలవులు ముగిసి, పాఠశాలలు మళ్లీ తెరిచారు. పిల్లలంతా ఆటలు చాలించి పుస్తకాలు, పలకలు పట్టుకుని వచ్చారు. ఎటువంటి సౌకర్యాలు లేని మారుమూల గ్రామంలోని ఏకోపాధ్యాయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మాది. ఆ ఊరిలో మూడు వంతుల మంది అక్షర జ్ఞానం లేనివారు, వ్యవసాయ కూలీలే! ఆ పాఠశాలలో నేనొక్కడినే ఉపాధ్యాయుడిని. దాదాపు అరవై మంది పిల్లలు అక్కడ చదువుకుంటున్నారు. పిల్లలంతా కోలాహలంగా ఉన్నారు. కొత్త విద్యార్థులను కూడా చేర్చుకుంటున్నాను.

"శ్రీనివాసరావు మాస్టారు మీరేనా?' రిజిస్టర్‌లో రాసుకుంటున్న నేను ఆ మాటలు విని తలెత్తి చూశాను. చిన్న పాపను వెంట బెట్టుకుని వచ్చి గుమ్మంలో నిలబడి అన్నది ఒకామె.

'అవును. నేనే! ఏం కావాలి?" అన్నాను.

'మా పాపను స్కూల్లో చేర్పించటానికి వచ్చాను" అన్నది.

'రండి. కుర్చోండి" అన్నాను.

పాపకి ఐదేళ్లు ఉంటాయి. తెల్లగా, బొద్దుగా, ముద్దుగా ఉంది. కుచ్చుల గౌను వేసుకుంది. తలలో గులాబీ పువ్వు పెట్టుకుంది.

'పాప పేరేమిటి?' అన్నాను. ఎడ్మిషన్ రిజిస్టర్‌లో రాసుకోవటానికి. 'సుకేశిని' చెప్పింది.

'ఎంత చక్కటి పేరు?' అనుకున్నాను మనసులో. తండ్రి పేరు, పుట్టిన తేదీ మొదలైన వివరాలు రాసుకున్నాను.

'పాపకు మాటలు రావండి. మూగ, చెముడు' అన్నది వాళ్లమ్మ. 'అవునా!' అన్నాను విస్మయంగా. తల్లి ముఖంలో నీలి నీడలు కమ్ముకున్నాయి.

'డాక్టర్‌కి చూపించకపోయారా?" అన్నాను.

'చూపించాము. మద్రాస్ తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించమన్నారు. చెవులు వినపడితే మాటలు కూడా వస్తాయని చెప్పారు. కూలి పనులు చేసుకునేవాళ్లం. అంత డబ్బు మాకెక్కడిది బాబూ! వీళ్ల నాన్న ఇప్పటికే ఖర్చు పెరిగిందని విసుక్కుంటున్నాడు' అన్నది.

నిట్టూర్చాను. నిజమే! వీళ్ల సమస్యలు ఒకరు తీర్చగలిగేవి కావు. 'చూడమ్మా! ఎడ్మిషన్ ఇవ్వమంటే ఇస్తాను. నాకేం అభ్యంతరం లేదు. ఇలాంటి పిల్లలకు ప్రత్యేకమైన పాఠశాలలు, ప్రత్యేకమైన టీచర్లు ఉంటారు. దూర ప్రాంతాల నుంచీ వచ్చే వారికి హాస్టల్ వసతి కూడా కల్పిస్తారు. అలాంటిచోట చేర్పిస్తే మంచిది– ఇక్కడ అందరూ పిల్లలతో కలిపి చెప్పటం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు' అన్నాను.

“ ఒక యువకుడు ఎదురొచ్చి 'రండి! బావున్నారా?' అన్నాడు చిరునవ్వుతో.
"మహీ! ఏంట్రా ఇది? ఈ ఏర్పాట్లన్నీ నువ్వు చేశావా?" అన్నాను ఆశ్చర్యంగా.
"లేదు డాడీ! నేనేం చేయలేదు" అన్నాడు అయోమయంగా చూస్తూ.
"బాబూ! ఎవరు మీరు? ఏమిటిదంతా?" అని అడిగాను ఆ యువకుడితో.
"అన్నీ తెలుస్తాయి. రండి" అన్నాడు. ”

'పర్వాలేదండి. ఒక్కొక్క ముక్కే నేర్చుకుంటుంది. పాప నన్ను వదిలి ఉండలేదు' అన్నది.

'సరే! మీ ఇష్టం' అని ఒకటవ తరగతిలో చేర్చుకుంటున్నట్లుగా రిజిస్టర్‌లో రాసి, తల్లి చేత సంతకం చేయించుకున్నాను. ఆమె వెళ్లిపోయింది.

వారం రోజులు గడిచాయి. సుకేసిని చాలా చురుగ్గా ఉంటుంది. పెదవుల కదలికను బట్టి ఎదుటివాళ్లు చెప్పేది అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తుంది. మాటలు రాకపోయినా సైగలు చేసి చెప్పాలని ఆరాటపడుతుంది. ఆ పాపను చూసినప్పుడల్లా నా మనసు జాలితో నిండిపోతుంది. ఒక నోరు నాలుగు నోళ్లుగా చేసి, అరిచి పోట్లాడగలిగితేనే ఈ పాపిష్టి ప్రపంచంలో బతకటం కష్టం. అలాంటిది కనీసం తన అభిప్రాయం కూడా చెప్పే అవకాశమే లేకపోతే పాపం ఎలా బతుకుతుంది? ఇంత చక్కటి రూపం ఇచ్చి భగవంతుడు ఆ లోపం ఎందుకు పెట్టాడో? అనిపిస్తుంది.

పలక మీద ప్రతి రోజూ అక్షరాలు రాసి ఇచ్చేవాడిని. సుకేశిని అవి దిద్దుకుని చూడకుండా రాసి చూపించేది. రెండు నెలలు గడిచేసరికి తెలుగులో అక్షరాలు, గుణింతాలు, ఇంగ్లీషు అక్షరాలు కూడా నేర్చేసుకుంది. ఆ పాప తెలివి తేటలకు ఆశ్చర్యపోయాను.

సుకేశిని రెండవ తరగతిలోకి వచ్చింది. పాఠాలు తప్పుల్లేకుండా గుండ్రటి అక్షరాలతో రాసి చూపించేది. స్కూల్లో బాల సాహిత్యం మీద అనేక పుస్తకాలు ఉన్నాయి. మధ్యాహ్నం పూట భోజనాలు అయిన తర్వాత పిల్లలు అల్లరి చేయకుండా కథల పుస్తకాలు ఇచ్చి చదువుకోమనే వాడిని. పిల్లలంతా కథలు చదువుకుంటుంటే సుకేశిని మాత్రం కథల్లో బొమ్మలు వేసి చూపించింది. అది చూడగానే నా మనసులో తళుక్కున ఓ ఆలోచన తట్టింది.

సుకేశిని పాఠాలు చూసి రాయడం నేర్చుకుంది. కానీ ఆ పదాల ఉచ్చారణ తెలియకుండా, ఆ పదాల భావం తెలియకుండా చూసి రాయడం వల్ల ఉపయోగమేమిటి? అలా కాకుండా బొమ్మలు వేసే నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మంచి చిత్రకారిణిగా పేరు తెచ్చుకుంటుందేమో! అనుకున్నాను. తనకు డ్రాయింగ్ నోట్స్, రంగు పెన్సిళ్ళు, స్కెచ్ పెన్నులు కొని ఇచ్చాను. రోజూ ఆ అమ్మాయి చేత బొమ్మలు వేయించేవాడిని. వాటిని సరిచేసి ఎలా గీయాలో చూపించేవాడిని.

ఆరు నెలలు గడిచాయి. ఆ సంవత్సరం బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్, డ్రాయింగ్ పోటీలో జూనియర్స్ విభాగంలో సుకేశినికి ప్రథమ బహుమతి వచ్చింది. దానితో ఇంకా బాగా నేర్వాలనే ఉత్సాహం కలిగింది.

సుకేశినికి తొమ్మిదేళ్ళు వచ్చాయి. ఎక్కడ పోటీలు జరిగినా ఆమెను వెంటబెట్టుకుని వెళ్ళి పాల్గొనేట్లు చేసేవాడిని. బహుమతులు వచ్చేవి. బొమ్మలు స్వంతంగా వేయటం బాగా అలవడింది. ఆ పాపను చూస్తుంటే నేను నాటిన మొక్క పెరిగి పెద్దయి పూలు పూస్తున్నట్లు ఆనందంగా అనిపించేది. పనిమీద టౌన్‌కి వెళ్ళినప్పుడు వాటర్ కలర్స్, బ్రష్‌లు, పెయింట్స్ కొని తెచ్చి బహుమతులుగా ఇచ్చేవాడిని.

ఆ మరుసటి సంవత్సరం సుకేశిని అయిదవ తరగతిలో ఉండగా నాకు ట్రాన్స్‌ఫర్ అయింది. కుటుంబం మొత్తం వేరే ఊరికి షిఫ్ట్ అయ్యాము. సంవత్సరాలు గడచిపోయాయి. నాకు ప్రమోషన్ వచ్చింది. మా అబ్బాయి మహేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయి అమెరికాలో స్థిరపడిపోయాడు. అతడికి పెళ్ళి అయింది. పిల్లలు పుట్టారు.

నేను ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాను. నా భార్య గతించింది. 'ఇక్కడ ఒక్కడివే ఎలా ఉంటావు? నాతో పాటు వచ్చెయి. అందరం కలిసి ఉందాం' అని మహేష్ నన్ను అమెరికా తీసుకుని వెళ్ళాడు. కొడుకు, కోడలు ఇద్దరూ ఉద్యోగాలకి వెళతారు.

“నేను మీ విద్యార్థినిని” అన్నది.
“గుర్తు రావటం లేదు తల్లీ! ఎన్నో వందల మంది విద్యార్థులను చూశాను. పైగా పెద్దతనం” అన్నాను.
“సుకేశిని అనే మూగ అమ్మాయి ఉండేది. ఆ పాపకి మీరు బొమ్మలు గీటయం నేర్పేవారు...”
“అవునవును గుర్తొచ్చింది” అన్నాను ఆనందంగా.
“ఆ సుకేశినిని నేనే!”
“నువ్వా? మరి...” ఆగిపోయాను.”

పిల్లలు స్కూల్‌కి వెళతారు. ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిన తర్వాత చాలా వంటరిగా అనిపించేది. నా బాల్యం, యవ్వనం, వివాహం కావటం, పిల్లలు పుట్టడం అన్నీ గుర్తుకు వచ్చేవి. ఎక్కువగా నా బాల్యం, పుట్టి పెరిగిన ఊరు, తల్లిదండ్రుల చేతిలో గారాబంగా పెరగటం గుర్తొచ్చేవి.

ఆ రోజుల్లో మా ఇంటి ఎదురుగా గ్రామ దేవత మర్లమ్మ గుడి ఉండేది. గుడి పక్కనే పెద్ద వేపచెట్టు ఉండేది. ప్రతి ఆదివారం చెట్టు కాండం కడిగి, పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టేవారు. అన్నంలో పెరుగు, ఉల్లిపాయలు కలిపి చేసిన 'చద్ది' అమ్మవారికి నైవేద్యం పెట్టేవారు. మేం పిల్లలం అంతా చెరువులో దిగి తామర తూడులతో దండలు చేసి పూజలు చేసేవాళ్ళం. కొత్తగా పెళ్ళయిన దంపతులు ముందుగా అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి, కొబ్బరికాయ కొట్టిన తర్వాతే ఇంట్లోకి వెళ్ళేవారు.

మా స్నేహితుల బ్యాచ్‌లో ముగ్గురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలు ఉండేవారు. బొమ్మలకి రంగు రంగుల బట్టలు వేసి బొమ్మల పెళ్ళి చేసేవారు. అబ్బాయిలు మర్రి ఆకులతో బాకాలు ఊదేవారు. ఆదివారం పూట ఊరి చివర మర్రి చెట్టు కింద అందరూ చేరి ఊడలతో ఉయ్యాలలూగే వాళ్ళం. ఆ సంఘటనలు గుర్తు వస్తే పూల తెప్పలో తేలిపోతున్నట్లు ఉండేది.

అమెరికా వచ్చిన తర్వాత అంతా యాంత్రిక జీవనం. నా ఆలోచనలు, అభిరుచులు పంచుకోవటానికి భావసారూప్యం ఉన్న మనుషులు దొరకలేదు. రోజులో మూడు వంతులు వంటరితనంతోనే గడచిపోయేది.

నేను చేసింది ఉపాధ్యాయ వృత్తి. పాఠాలు చెప్పటానికి కంప్యూటర్‌తో పనిలేదు. పైగా అప్పట్లో కంప్యూటర్ విద్య అంతగా అభివృద్ధి చెందలేదు. ఇక్కడికి వచ్చిన తర్వాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన అప్రయత్నంగానే అలవడింది. నా ఆలోచనలు, భావాలు ఫేస్‌బుక్‌లో పెట్టేవాడిని. అవి చదివిన వాళ్ళు వాళ్ళ స్పందనలు తెలియజేసేవాళ్ళు.

నేను అమెరికా వచ్చి అయిదేళ్ళు అయింది. ఇలాగే ఇంకో అయిదేళ్ళు గడిచిపోతే నా జీవితం అయిపోతుందేమో! ఇప్పటికే గుండె జబ్బు, బి.పి, షుగర్ దాడి చేసి శరీరాన్ని శిథిలం చేస్తున్నాయి. మిగిలిన కొద్ది జీవితమైనా సంతృప్తిగా గడపాలి. నా జన్మభూమిని చూడాలి. మా ఊళ్ళో మర్లమ్మ గుడి దగ్గర వేప చెట్టు కింద కూర్చుని చల్లగాలి ఆస్వాదించాలి.

ఇండియా తిరిగి వెళ్ళాలనే ఆకాంక్షను మహేష్‌తో చెప్పాను. 'సారీ డాడీ! కొవెవరంలో మన ఇల్లు, ఖాళీ స్థలం అమ్మేశాను. మీరు నా దగ్గరే ఉంటారు కదా! ఇక అక్కడికి వెళ్ళే పనేముంది? అనుకున్నాను. ఇప్పటిదాకా ఈ విషయం చెప్పే అవకాశం రాలేదు' అన్నాడు.

ఒక్క క్షణం నిశ్చేష్టుడినయ్యాను. 'అయినా ఫర్వాలేదు. ఏదైనా ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటాను. నేనిక్కడ ఉండలేనురా మహీ! నా ఘటం మన ఊళ్ళోనే వెళ్ళిపోతేనే నా ఆత్మకు శాంతి' అన్నాను.

'సరే డాడీ! మీ ఇష్టం. ఏర్పాట్లు చేస్తాను' అన్నాడు.

ఎన్నో సంవత్సరాల తర్వాత నేను పుట్టిన ఊరు రాబోతున్నాను. నా మనసు ఆనందంతో నిండిపోయింది. ఇవన్నీ వెంటనే ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాను.

నేను ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. హైదరాబాద్‌లో ఫ్లయిట్ దిగుతుంటే నాకు వెర్రి ఆనందం కలిగింది. నా దేశం వచ్చేసింది. ఇంకొద్దిసేపటిలో నా జన్మభూమిని చూడబోతున్నాను అనుకున్నాను.

హైదరాబాద్ నుంచీ కారు మాట్లాడుకుని నేను, మహీ, కోడలు, పిల్లలు అందరూ ప్రయాణమయ్యాం. కారు విజయవాడ దాటి మంగళగిరి మలుపు తిరుగుతుంది. కాలవలో ఈతలు కొట్టే కుర్రాళ్ళు, రోడ్డుకి అడ్డం వచ్చే

గేదెలు, తట్ట నెత్తిన పెట్టుకుని గోంగూర అమ్మే కూరలమ్మి... అబ్బా! ఈ పరిసరాలు చూసి ఎన్నాళ్లయింది? కారు కాఫీ పొడి ఫ్యాక్టరీ దాటుతూంటే కాఫీ పొడి సువాసన గుండెల నిండా పీల్చుకున్నాను.

కళావరం వచ్చింది. కారు కాలవ మీది వంతెన దిగుతూంటే నా మనసు ఉత్సాహంతో ఉరకలు వేసింది. అదిగో! ఆ మర్రిచెట్టు కిందే చిన్నప్పుడు ఊడలు పట్టుకుని ఊయలలూగాము.

మర్రిచెట్టు దగ్గరకు రాగానే ఎర్రటి యూనిఫాంలో ఉన్న వాద్యగాళ్లు బ్యాండు మేళం వాయిస్తూ ఎదురొచ్చారు. షర్టు నీట్‌గా టక్ చేసుకుని ఉన్న ఒక యువకుడు ఎదురొచ్చి 'రండి! బావున్నారా?' అన్నాడు చిరునవ్వుతో.

"మహీ! ఏంట్రా ఇది? ఈ ఏర్పాట్లన్నీ నువ్వు చేశావా?" అన్నాను ఆశ్చర్యంగా.

"లేదు డాడీ! నేనేం చేయలేదు" అన్నాడు అయోమయంగా చూస్తూ.

"బాబూ! ఎవరు మీరు? ఏమిటిదంతా?" అని అడిగాను ఆ యువకుడితో.

"అన్నీ తెలుస్తాయి. రండి" అన్నాడు.

కారు మర్లమ్మ గుడి దగ్గర ఆగింది. ఎదురుగా నాలుగు వైపులా ప్రహరీ గోడతో మధ్యలో చిన్న ఇల్లు. ఇంటి పక్కన కొబ్బరి, అరటి చెట్లు, గేటు దగ్గర నుంచీ ఇంటి వరకూ మామిడాకుల తోరణాలు కట్టి ఉన్నాయి. కాలిబాట కిరుపక్కలా బంతి, చేమంతి, మల్లె మొదలైన పూల చెట్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. మామిడి చెట్టు మీద చిలకల కువకువలు వినిపిస్తున్నాయి.

"ఎవరి ఇల్లు ఇది?" అడిగాను.

"మీ ఇల్లే!" అన్నాడు యువకుడు.

"మా ఇల్లా!" అన్నాను ఆశ్చర్యంగా. "మన ఇల్లు అమ్మేశానని అన్నావుగా మహీ!" అన్నాను. వాడు కూడా అయోమయంగా చూస్తున్నాడు.

ఇంతలో ఒక యువతి వచ్చింది. ఆమెకు సుమారు ముప్పై ఏళ్లు ఉండవచ్చు. హంసలబారు ఉన్న నెమలి పింఛం రంగు చీర కట్టుకుంది. పొడవాటి జడ వేసుకుంది. జడలో నుంచీ కనకాంబరం మాల వేలాడుతోంది. నాకు ఎదురొచ్చి నమస్కరించింది.

"ఈమె ప్రఖ్యాత చిత్రకారిణి. ఇటీవలే ఈమెకు ప్రభుత్వం పద్మశ్రీ బిరుదు ఇచ్చింది" అన్నాడు యువకుడు.

"నేను మీ విద్యార్థినిని" అన్నది.

"గుర్తు రావటం లేదు తల్లీ! ఎన్నో వందల మంది విద్యార్థులను చూశాను. పైగా పెద్దతనం" అన్నాను.

"సుకేశిని అనే మూగ అమ్మాయి ఉండేది. ఆ పాపకి మీరు బొమ్మలు గీటయం నేర్పేవారు..."

"అవునవును గుర్తొచ్చింది" అన్నాను ఆనందంగా.

"ఆ సుకేశినిని నేనే!"

"నువ్వా? మరి..." ఆగిపోయాను.

"మీ సందేహం నాకు అర్థమయింది. ఎలా మాట్లాడగలుగుతున్నానో అనే కదా! నాకు పన్నెండేళ్ల వయసులో ఆపరేషన్ అయింది. మాట వచ్చింది. నేను చిత్ర లేఖనంలో చూపే ప్రతిభను గుర్తించి ఎన్నో విద్యాసంస్థలు ఉచితంగా విద్య నేర్పటానికి ముందుకు వచ్చాయి. వారే ఆపరేషన్ కూడా చేయించారు. యం.ఎ చేశాను. కానీ చిత్రకారిణిగానే ఎక్కువ పేరు వచ్చింది. నేను కూడా డ్రాయింగ్ స్కూల్ స్థాపించి విద్యార్థులకు నేర్పుతున్నాను.

ఎక్కడో మారుమూల గ్రామంలో నిరక్షరాస్యుల మధ్య ఉన్న నన్ను చేయి పట్టుకుని నేను చేరుకోవలసిన గమ్యంవైపు తొలి అడుగులు వేయించారు. ఆ దారిలో కొంత దూరం ప్రయాణించగానే బంగారు భవిష్యత్ కనిపించింది. నేను ఈ స్థాయికి చేరుకోవటానికి సహకరించిన అందరికీ ఏదోవిధంగా రుణం తీర్చుకున్నాను. మీ రుణం తీర్చుకోవటానికి అవకాశం రాలేదే అని మదనపడుతూ ఉండేదాన్ని.

ఫేస్‌బుక్‌లో మీ పేరు, ఫొటో చూసి గుర్తు పట్టాను. మీరు పోస్ట్ చేసిన విషయాలు ఎప్పటికప్పుడు చదువుతూ మీ భావాలు అర్థం చేసుకున్నాను. మీ జన్మస్థలం మీద ఎంత మక్కువో అర్థం అయింది. ఈ స్థలాన్ని కొని, మీకు నచ్చేటట్లు తీర్చిదిద్ది 'గురుదక్షిణ'గా ఇవ్వాలనుకున్నాను. దయచేసి అంగీకరించండి' అన్నది సుకేశిని.

ఆ మాటలతో చెప్పలేని భావోద్వేగంతో నిండిపోయింది నా మనసు. "కన్న బిడ్డ కూడా చేయలేని పని నువ్వు చేశావు. నువ్వు నా విద్యార్థిని అయినందుకు గర్విస్తున్నాను" అన్నాను ఆనందంగా.

"నా ఆశయ సాధనలో సహకరించిన నా జీవిత భాగస్వామి మాధవ్" అంటూ ఆ యువకుడిని పరిచయం చేసింది.

"మమ్మల్ని దీవించండి మాస్టారూ!" అన్నాడు మాధవ్ పాదాలకు నమస్కరిస్తూ... సుకేశిని కూడా వంగి నమస్కరించింది.

"ఆయురారోగ్యాలతో నూరేళ్లు సుఖంగా జీవించండి" అన్నాను.

"లోపలికి రండి" అన్నది సుకేశిని. మహీ, కోడలు, పిల్లలూ అంతా ఇది ఆశ్చర్యంగా చూస్తూ లోపలికి నడిచారు నాతోపాటు.

ఆ ఇంట్లోకి అడుగు పెడుతూంటే తప్పిపోయిన పిల్లవాడు చాలాకాలం తర్వాత తిరిగి ఒడిలోకి చేరుకున్నట్లుగా నిశ్చింతగా, అనిర్వచనీయమైన ఆనందంగా అన్పించసాగింది నాకు.

★

రంగస్థలం

ప్రవేశానికి చివర నిష్క్రమణం
ప్రతి నిష్క్రమణం ముందు ప్రవేశం
ప్రవేశం ఉంటే నిష్క్రమణం
నిష్క్రమణం వుంటే ప్రవేశం
జీవితం ప్రవేశాల
నిష్క్రమణల మాలిక!
అనావృష్టికి చలించిన మేఘాలు
తల్లి నేలను తడపలేనందుకు
ముప్పిరిగొన్న బాధతో మంచం పట్టి
చలనం లేక నిశ్చలనమయ్యాయి!
నీటిని నుజ్జు నుజ్జు చేసినందుకు
దుఃఖించిన జలపాతం
చిట్లిన కన్నీటిని
వీక్షకులపై చల్లి
బాధను
వ్యక్తపరుస్తుంది!
అస్తిత్వం
చాటుకునేందుకు
కొమ్మల్ని రెమ్మల్ని
ఆకుల్ని
విశ్రాంతినివ్వక
క్షణక్షణం వూపినందుకు
మదనపడుతుంది మారుతం!
ప్రతి సంతోషం చివర ఒక దుఃఖం
ప్రతి దుఃఖం ముందు ఒక సంతోషం!
పాటకు శ్రోతలు
ఆకాశంలో మనస్సును
హాయిగా ఎగరేసిన నేపథ్యంలో
పాటలో ఇమిడిన
ఒకానొక విషాద ఆలాపన
శ్రోతలకు పట్టుబడింది!
నటరాజుకు దీటుగా
నర్తించిన నాట్యంలో
భీకర బీభత్స రసాల్లో
చొప్పించిన కరుణరసం
వీక్షకులు పసిగట్టారు!
రాసిన ద్విపదలో
సమ్మోహం చేసి
రచనలో దాగిన
ఒకానొక విషాదాన్ని
గుండె గుర్తించింది!
ప్రతి ఆహ్లాదం చివర ఒక విషాదం
ప్రతి విషాదం ముందు ఒక ఆహ్లాదం!

◆కవిత్వమ్

- అడిగోపుల వెంకటరత్నమ్

▪ఫోన్: 91 9848252946

తెల్లని వస్త్రాలు.. ఓ సైకిల్..దానికో బ్యాగు.. దాని నిండా నాటక ఆహ్వాన పత్రాలు.. దారి పొడవునా కళాకారులను పలుకరిస్తూ.. నాటక అభిమానులను ఆహ్వానిస్తూ.. కష్టంతో కాలాన్ని తోసుకుంటూ.. కన్నుల్లో భవితను తలుచుకుంటూ.. ఎండా, వానా, చలీ.. వీటిని పక్కకు నెట్టేసుకుంటూ ఒకటే ధ్యేయం.. అదే నాటక రంగ వికాసం.. ఒకటే ఆశయం అదే జానపద కళలకు ప్రాణ ప్రతిష్ట చేయడం.. ఆయనే స్వాతంత్ర్య సమరయోధులు, ఒకప్పటి ప్రజానాట్యమండలి కళాకారుడు, ఆంధ్రా నాటక కళాసమితి వ్యవస్థాపకులు కర్నాటి లక్ష్మీనరసయ్య. నాటకరంగం పేరెత్తగానే ఉరకలు వేసే ఉత్సాహంతో.. గత స్మృతులను గుర్తుచేసుకుంటూ గలగలా మాట్లాడేస్తారు. నేటితో 90వ వసంతంలోకి అడుగిడుతున్న కర్నాటి లక్ష్మీనరసయ్యతో కాసేపు.

కళ నా శ్వాస

ఖమ్మం జిల్లా మధిర తాలూకాలోని దెందుకూరు నా స్వగ్రామం. నా జీవనం కటిక దారిద్ర్యంతో ప్రారంభమైంది. తల్లిదండ్రులు చదువు చెప్పించలేని స్థితిలో గొర్రెల కాపరిగా మారాను. పశువుల దగ్గర పేడ కళ్లు ఎత్తేశాను. ఇంత కష్టపడుతూ కూడా ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో నడిపిన రాత్రి పాఠశాలలో చదువుకున్నాను. చదువుకున్న ఆ పాఠశాల్లోనే ఇతరులకు చదువు చెప్పాను. అదే సమయంలో ఊళ్లో ఉన్న కళాకారుల ప్రభావం నాపై పడింది. నాటికలు, పగటి వేషాలు, బుర్రకథలు, భజన, కోలాటం, డప్పు వాయిద్యాలు, చిందు కళారూపాలు ప్రదర్శించేవారు. అవన్నీ తిలకించడం వల్ల నాకు వాటిపై అభిరుచి కలిగింది.

నేనుంటున్న రెడ్డిగూడేనికి ఆంధ్ర మహాసభ కార్యకర్తలు వస్తుండేవారు. ఊళ్లో అందరూ అందులో పనిచేసేవారు. త్రిపురనేని వెంకటేశ్వరరావుగారు దేవుడుపై రాసిన పద్యాలు చదివాక.. వాటిని పోల్చుకుని సమాజంలో జరుగుతున్న తతంగాలను చూసి నేను హేతువాదిగా మారాను. ఆ తరుణంలోనే ఆంధ్ర మహాసభ నిజాముకు వ్యతిరేకంగా ఇచ్చిన పిలుపులు నన్నాకట్టుకున్నాయి. వాటి స్ఫూర్తితో నేను మహాసభ కార్యకర్తగా తయారయ్యాను. ఆనాటి సమాజంలో మార్పు తెచ్చేందుకు ప్రజలను చైతన్యవంతులను చేయడానికి రకరకాల కళారూపాలను ఎంచుకొని ప్రదర్శించడం ప్రారంభించారు. అల్లీనగరానికి చెందిన నీరుకొండ అప్పారావు, వట్టికొండ నాగేశ్వరరావు, రామకోటయ్య వంటివారు సుంకర-వాసిరెడ్డి రాసిన "ముందడుగు" నాటకాన్ని సాధన చేయించేందుకు.. నాతో ఉపాధ్యాయ ఉద్యోగాన్ని మాన్పించారు. 'ముందడుగు'లో కథానాయకుడి పాత్ర నాతో వేయించారు. నైజాం స్టేట్‌కూ, కృష్ణాజిల్లాకూ సరిహద్దునున్న గ్రామాల్లో ఈ నాటకాన్ని ప్రదర్శించాము. జగ్గయ్యపేటలో ఈ నాటకం వేసేటప్పుడు ప్రజల నుంచి వచ్చిన స్పందన నేనీనాటికీ మరిచిపోలేను. ప్రేక్షకులు డబ్బులు, చేతిగడియారాలు, ధాన్యం, మహిళలైతే బంగారు చెవిదుద్దులు, ముక్కుపుడకలు బహూకరించేవారు. ఆరోజుల్లో రైతుల నుంచి అక్రమంగా లెవీ వసూళ్లు చేసేవారు. వీటిని కట్టొద్దని ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఊటుకూరులో బుర్రకథను చెపుతున్నాం. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి మమ్మల్ని అరెస్టు చేసి మధిర జైల్లో పెట్టారు.

జైలు నుంచి విడుదల కాగానే బెజవాడలో ప్రజానాట్యమండలి ఆఫీసుకు వెళ్లాను. అక్కడెవరూ లేరు. నాయకులంతా రహస్య జీవితం గడుపు తున్నారు. అక్కడ నేను నాలుగు రోజులు ఆహారం లేకుండా గడిపాను. అక్కడే అఫీసు వెనుక ఉండే తాతినేని ప్రకాశరావుగారు (ఆ తర్వాత కాలంలో ప్రముఖ సినీ దర్శకులు) నా దయనీయ స్థితి చూసి రెండు రూపాయలిచ్చారు. రోజుకు పావలా ఇచ్చి హోటల్లో ఒక పూట భోజనం చేసేవాణ్ణి. నేను ఆ ప్రజానాట్యమండలి ఆఫీసుకు కార్యదర్శినయ్యాను. డాక్టర్ గరికపాటి రాజారావు నేతృత్వంలో 'మాభూమి' నాటక ప్రదర్శనలు ఎన్నో ఇచ్చాం. ఈ నాటిక కోసం మేం పడిన శ్రమ అంతా ఇంతా కాదు. నాటకాన్ని అత్యద్భుతంగా మలిచేందుకు నిత్యం సాధన.. శోధన చేసేవాళ్లం. నాటకంలో పాత్ర పోషించడంతోపాటు ప్రదర్శనానంతరం నాటక సామాగ్రి మోసే వంతు కూడా నాదే. ఇలా నా జీవితం ప్రజానాట్యమండలితో మమేకమై పోయింది.

'కళ నా శ్వాస. అది ఆగిపోయేంతవరకూ నా కళా యాత్ర కొనసాగుతూనే ఉంటుంది. 'కళ నిత్యం, కాలం క్షణికం' అన్నాడొక ఆంగ్లకవి. కళనే జీవనంగా నమ్ముకున్న వ్యక్తికి కాలంతో పనిలేదు. దాని మీద ధ్యాస ఉండదు. కాలం ఎలా వెళుతుందని కానీ, రోజు ఎలా గడుస్తుందని కానీ కళారాధకునికి పట్టదు. అతడికి కావలసింది సమాజంలో వస్తున్న మార్పులు. వాటికి అనుగుణంగా తన కళారూపాలను మలుచుకోవడం అదే అతడి వ్యాపకం. నా దృష్టిలో నేను కళారాధకుడినే. కళారంగాన్ని అభిమానించినవాడినే. నమ్ముకున్నవాడినే' అంటారు కర్నాటి లక్ష్మీనరసయ్య.

కళాకారులకు సేవలు

లక్ష్మీనరసయ్య 1965లో విజయవాడలో ఆంధ్ర నాటక కళా సమితి స్థాపించారు. సాంఘిక, జానపద, పౌరాణిక నాటకాలు, జానపద, శాస్త్రీయ, సంగీత నృత్య కళారూపకాలు వందలాదిగా ప్రోత్సహించారు. పరిషత్తులకు పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతినెలా 30 కళాకారులకు రూ.200 చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారు. ప్రతిఏటా 1500 మంది పేదల బిడ్డలకు పుస్తకాలు కొనిస్తున్నారు. డాక్టర్ గరికపాటి రాజారావు, సుంకర-వాసిరెడ్డి, బళ్ళారి రాఘవ ఒక్కొక్కరి పేరు మీద ఐదేసి వేల రూపాయలు చొప్పున అవార్డులు అందజేస్తున్నారు. అలాగే కర్నాటి లక్ష్మీనరసయ్య జీవిత సాఫల్య పురస్కారం పేరుతో రూ.పదివేల అవార్డు, జ్ఞాపిక, యోగ్యతా పత్రం అందజేస్తున్నారు. ఇంకా తటపర్తి వరలక్ష్మమ్మ స్మారక పురస్కారం కింద రూ.10 వేలు, మాగంటి అంజనీ స్మారక పురస్కారంగా రూ.10 వేలు, పరిచూరి శివయ్య-చిన్నమ్మ గార్ల స్మారక పురస్కారానికీ, నన్నపనేని లక్ష్మి స్మారక పురస్కారానికి, ముత్తవరపు వెంకటేశ్వరరావు స్మారక పురస్కారానికి పదేసి వేల వంతున అవార్డులు అందజేస్తున్నారు. ప్రతిఏటా జానపద కళాకారులు 100 మందికి నూతన వస్త్రాలు బహూకరించి వెయ్యినూట పదహార్లు అందజేస్తున్నారు.

- యు.రామకృష్ణ

పెద్దల అమెరికా యాత్ర

మోడీ అమెరికా యాత్ర గురించి మీడియా ఎంత ప్రచారం చేసింది? ఆయనగారి పర్యటన వల్ల మన దేశ ప్రజలకు ఒరిగేదేం వుండదని తెల్సినా... ఇండియాలో విమానం ఎక్కక ముందే కాదు. ఎక్కాక...అమెరికా నేల మీద దిగాక... మోడీ ప్రతి కదలికా...మాటా ...వార్తగా మారిపోయింది. అయితే ఇప్పుడు మనం చెప్పకోబోయేది గతంలో అమెరికా పర్యటించిన ఆరుగురు పెద్దల గురించి. వీరు ఎవరో కాదు? ప్రిన్సెస్ డయానా, జవహర్‌లాల్ నెహ్రూ, కృశ్చేవ్, ఫైడల్ క్యాస్ట్రో, విన్‌స్టన్ చర్చిల్, మహ్మద్ గడాఫీ. వారు చర్చించిన అధికారిక అంశాలు కాదుకానీ... ఆ సందర్భంగా వెలుగులోకి వచ్చిన సాధారణ విషయాలు మీకోసం.

వేల్స్ యువరాణి

ప్రిన్సెస్ డయానా, తన భర్త చార్లెస్‌తో కలిసి 1985లో అమెరికా సందర్శించింది. తొలి రోజున వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు రీగన్, ఆయన భార్య నాన్సీతో కలిసి విందు ఆరగించారు. ఇంతేకాక క్లింట్ ఈస్ట్‌ఉడ్, జాన్ ట్రవోల్టా, టామ్ సెల్లెక్ వంటి సినీ తారలు, నీల్ డైమండ్ వంటి గాయకులు, రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలను కలుసుకున్నారు. తమాషా ఏమంటే... భోజనానంతరం అతిథుల ముందు ఇచ్చిన గౌరవోపన్యాసంలో... వేల్స్ యువరాణి డయానా పేరునే మర్చిపోయారు రీగన్ గారు. ఓ క్షణం పాటే అనుకోండి. అనంతరం నిండు నీలం రంగు గౌనులో మెరిసిపోతున్న డయానా... సినీనటుడు జాన్ ట్రవోల్టాతో కలిసి చేసిన నృత్యాన్ని ఎవరు మాత్రం మర్చిపోగలరు చెప్పండి.

జవహర్ లాల్ నెహ్రూ

భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ. 1949లో ఆయన అమెరికాను సందర్శించారు. ఆ పర్యటన ముచ్చటగా మూడు వారాలపాటు సాగింది. పనిలో పనిగా కొలంబియా యూనివర్సిటీ వారిచ్చిన గౌరవ డాక్టరేట్ కూడా పుచ్చుకుని... చక్కటి ఉపన్యాసం ఇచ్చారు చాచాజీ. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను కలుసుకున్నారు. బోస్టన్‌లో ఓ టాక్సీ డ్రైవర్‌తో ఫొటో సైతం దిగేశారు. 'తొలిసారిగా ఎవ్వరూ అమెరికా వెళ్లకూడదు' అని ఆ పర్యటన సందర్భంగా నెహ్రూ జోక్ చేశాడని చెప్తుంటారు.

కృశ్చేవ్

అమెరికా పర్యటించిన సోవియట్ యూనియన్ తొలి నేత కృశ్చేవ్. ఈ పర్యటన 1959లో చోటు చేసుకుంది. అధికారిక చర్చోపచర్చల అనంతరం... సరదాగా... దేశంలో పలు ప్రాంతాలను సందర్శించాడాయన. భార్యతో కలిసి అనేక అమెరికన్ ప్రదేశాలను పర్యటించిన ఈ సోవియట్ నేతకు పాపం డిస్నీ లాండ్ చూడ్డానికి మాత్రం అనుమతి లభించలేదు. కారణం ఏంటనుకున్నారు. భద్రతా సమస్య. ఈయనకు సరైన రక్షణ ఏర్పాట్లు చేయలేమని భావించిన అధికారులు అనుమతి నిరాకరించార్ట. అయితేనేం! మార్లిన్ మన్రో, డీన్ మార్టిన్ వంటి హాలీవుడ్ స్టార్లతో కలిసి భోజనం చేసే అవకాశం లభించింది.

ఫైడెల్ క్యాస్ట్రో

క్యూబాలో విప్లవం విజయవంతమైన నాలుగు మాసాలకు... అమెరికన్ సొసైటీ ఆఫ్ న్యూస్ పేపర్ ఎడిటర్స్ ఆహ్వానం మేరకు అమెరికా వెళ్లాడు ఫైడల్ క్యాస్ట్రో. అప్పుడాయనకు 33 ఏళ్లు. పదకొండు రోజుల పర్యటనలో జార్జి వాషింగ్టన్ సమాధి దగ్గర పుష్పగుచ్ఛం వుంచాడు. బ్రోంక్స్ జూ సందర్శించాడు. యాంకీ స్టేడియంలో విందు ఆరగించడం పెద్ద వార్తే అయ్యిందా రోజుల్లో. అయితే పర్యటన అంతా తనకెంతో ఇష్టమైన సైనిక (ఆలివ్ గ్రీన్) దుస్తుల్లోనే జరిగింది.

విన్‌స్టన్ చర్చిల్

తొలిసారిగా 1895లో అమెరికా వెళ్లాడు విన్‌స్టన్ చర్చిల్. అప్పుడాయనకు సరిగ్గా 20 సంవత్సరాలు. మరికొద్ది రోజుల్లో పుట్టిన రోజు జరుపుకుంటాననగా అమెరికా ప్రయాణం పెట్టుకున్నాడు. తర్వాత 1900 సంవత్సరంలో బోయెర్ వార్ విజేతగా ఉపన్యసించడానికి అమెరికా వెళ్లాడు. మార్క్ ట్వెయిన్, రూజ్‌వెల్ట్‌లను కలుసుకున్నాడు. 1929లో మూడవ సారి అమెరికా పర్యటించినప్పుడు గొప్ప బిలియనీర్ థియోడర్ రాడాల్ఫ్ హారెస్ట్ ఆయనకు ఆతిథ్యమిచ్చాడు. 1930లో అమెరికా వెళ్లినప్పుడు .. న్యూయార్క్‌లో చిన్నపాటి యాక్సిడెంట్‌కూడా అయ్యింది.

మహ్మద్ గడాఫీ

లిబియా నేత మహ్మద్ గడాఫీ ఏ దేశం వెళ్లినా బెడోవిన్ గూడారంలో వుండడానికి ఇష్టపడేవాడట. 2009లో అమెరికా సందర్శించినప్పుడు కూడా అలాంటి ప్రయత్నమే చేశాడు. బెడ్‌ఫోర్డ్‌లోని సెంట్రల్ పార్క్‌లో గుడారం వెయ్యబోతే స్థానికులు వ్యతిరేకించారు.

◆ కవర్‌స్టోరీ

సిరుల సింగపూర్

ఆదిమూలం శేఖర్

చంద్రబాబు నాయుడి కలల దేశం - సింగపూర్
కెసిఆర్ కలవరిస్తున్న దేశం - సింగపూర్
మోడీ మాట్లాడుతున్న దేశం - సింగపూర్
పాలకులంతా జపిస్తున్న దేశం - సింగపూర్
అభివృద్ధికి మారు పేరుగా చెబుతున్న దేశం - సింగపూర్ ఇంతకీ సింగపూర్‌లో ఏముంది? పరిమిత వనరులే ఉన్నా.... అగ్రగామిగా ఎలా నిలవాలో సింగ పూర్‌ను చూస్తే తెలుస్తుంది. చాలాచాలా తక్కువ భూమివున్నా.... దేశ ప్రజలందరికీ ఇళ్లు ఎలా నిర్మించవచ్చో సింగపూర్‌ను చూస్తే తెలుస్తుంది. రోడ్లు వేసుకోడానికి స్థలం లేకున్నా.... అద్భుతమైన రవాణా వ్యవస్థ రూపొందించడం ఎలాగో సింగపూర్‌ను చూస్తే తెలుస్తుంది. మంచినీళ్లు దిగుమతి చేసుకుంటున్నా....ఇళ్లకు 24 గంటలూ తాగునీళ్లు ఎలా ఇవ్వవచ్చో సింగపూర్‌ను చూస్తే తెలుస్తుంది. ఏమున్నా లేకున్నా.... నిజాయితీ, అంకితభావం ఉంటే ఎంత సాధించవచ్చో సింగపూర్‌ను చూస్తే తెలుస్తుంది. సింగ'పూర్' పేరులోనే పేదరికం ఉన్నా... అది ఇప్పుడు కాదు...ఒకప్పుడు. ఇప్పుడు సిరుల సింగపూర్. సొగసుల సింగపూర్. భూతల స్వర్గపూర్. డబ్బున్నోళ్లకు విలాసపూర్. అందుకే! సింగపూర్‌లో ఏముందో...ఏం జరిగిందో...ఏం జరుగుతోందో చూద్దాం.

సింగపూర్ ఒక పెద్ద ద్వీపంలోని చిన్న దేశం. తూర్పు నుంచి పడమరకు 50 కిలోమీటర్లు, ఉత్తరం నుంచి దక్షిణానికి 26 కిలోమీటర్లు ఉండే దీవిలో విస్తరించిన నగరమే సింగపూర్. దీని చుట్టూ 59 చిన్నచిన్న దీవులున్నాయి. వీటిలో జురాన్గ్, సెంటోసా, పులవ్ టెక్నాగ్, పులవ్ బియన్ కొన్ని ముఖ్యమైనవి. మొత్తంగా సింగపూర్ విస్తీర్ణం 723 చదరపు కిలోమీటర్లు మాత్రమే. ప్రస్తుత జనాభా 53 లక్షలు మాత్రమే. అంటే మన హైదరాబాద్ కంటే 30 లక్షలు తక్కువ. ఇక్కడి జనాభాలో 77 శాతం చైనీయులు, 14 శాతం మలయా దేశం వచ్చి స్థిరపడినవారు, 7.6 శాతం భారతీయులు అందులోనూ తమిళుల శాతం ఎక్కువ, 1.4 శాతం మంది ఇతర దేశస్తులున్నారు. ఇంగ్లీషు, చినీ, తమిళం అధికారిక భాషలు. అక్షరాస్యత 95.4 శాతం. జనసాంద్రత రీత్యా రెండో స్థానంలో ఉంది. ఇక్కడ చదరపు కిలోమీటరుకు 7,540 మంది నివసిస్తున్నారు. పరిమితమైన భూభాగాన్ని దృష్టిలో ఉంచుకుని 1960 నుంచి కుటుంబ నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేశారు. ఇద్దరు పిల్లల నియమాన్ని పాటించారు. అయితే ఆ తరువాత మానవ వనరుల కొరత ఏర్పడకుండా చూసేందుకు బేబీ బోనస్ చట్టాన్ని 2001 తీసుకొచ్చారు. సింగ (సింహం) పుర (పురం) అనే రెండు మలయ్ పదాల కలయికతో సింగపూర్ అనే పేరు వచ్చిందట.

భూమి కోసం...

ఎక్కడైనా భూమి అనేది పరిమిత వనరే. సింగపూర్‌లో ఈ సమస్య మరీ ఎక్కువ. ఎందుకంటే సింగపూర్‌లో తొలి ప్రజాప్రభుత్వం ఏర్పడేనాటికి ఆ దేశ భూభాగం 591 చదరపు కిలోమీటర్లు మాత్రమే. మిగతా అంతా సముద్రమే. సము ద్రంలో మునిగిన భూమిని వినియోగిం చు కోడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. దీనికి అవసరమైన మట్టిని దేశంలోని గుట్టలను, సముద్రంలో మునిగిన భూమిని తవ్వి సేకరించారు. ఇండొనేషియా నుంచి ఇసుక దిగుమతి చేసుకున్నారు. దీంతో 50 ఏళ్లలో సింగపూర్ భౌగోళిక విస్తీర్ణం 723 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. చిన్నచిన్న మట్టిదిబ్బల్లాంటి దీవులను ప్రధాన దీవులతో కలుపుతూ వస్తున్నారు. దీనిపైనే నలభై, యాభై అంతస్తుల భవనాలు, రిజర్వాయర్లు, ఉద్యానవనాలు, రోడ్లు, రైలు మార్గాలు నిర్మించింది. ప్రపంచ చరిత్రలో ఇదొక అద్భుతం.

గ్రామాలే లేవట

ఆశ్చర్యం కలిగించవచ్చుగానీ...సింగపూర్‌లో గ్రామీణ ప్రాంతాలే లేవట...ఆ దేశ జనాభా లెక్కల్లోనూ పట్టణ, గ్రామీణ అనే తేడా ఏమీ చూపలేదు. ప్రపంచ బ్యాంకు ఇండికేటర్స్‌లోనూ సింగపూర్ జనాభా విషయంలో గ్రామీణ జనాభాను సున్నాగా పేర్కొనడం గమనార్హం. పరిమితమైన భూభాగం ఉండడం వల్ల ఒకప్పుడు గ్రామాలుగా ఉన్నవాటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అక్కడ శాటిలైట్ టౌన్‌షిప్పులు నిర్మించింది. 'కాంపాంగ్ బాంక్‌కాక్' అనే గ్రామమే సింగపూర్‌లో చివరి గ్రామమట. ఆ గ్రామాన్ని కూడా స్వాధీనం చేసుకుని అక్కడ పెద్ద టౌన్‌షిప్పు నిర్మించారు. దీంతో ఆ దేశంలో గ్రామీణ ప్రాంతమనేదే లేకుండాపోయిందని పలు వెబ్‌సైట్ల కథనం. అంటే వందశాతం పట్టణీకరణ జరిగినట్లు చెప్పుకోవాలి. దీనిపైన పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, నివాసాల కోసం అడవులను, చెట్లను నరికేస్తున్నారట. ఇది పర్యావరణ

సమతుల్యాన్ని దెబ్బతీస్తున్నదని చెబుతున్నారు.

వ్యవసాయమే లేదు

మన పాలకులు....సింగపూర్‌లా దేశాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. మనది ప్రధానంగా వ్యవసాయక దేశం. అయితే సింగపూర్‌లో వ్యవసాయమే లేదు. భూమి అందుబాటులో లేకపోవడంతో అక్కడ సేద్యమే చేయడం లేదు. దేశ ప్రజల ఆహార అవసరాల్లో 90 శాతానికిపైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. 1987 మునుపు 2 వేల హెక్టార్లలో వ్యవసాయం ఉండేదట. ఆధునికీకరణలో భాగంగా అవన్నీ కనుమ రుగైపోయాయి. ఆ దేశ జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా సున్నా. ప్రస్తుతం ఆర్చడ్ రోడ్ అనే ప్రాంతంలో పండ్లు, కూరగాయల తోటలు పరిమిత విస్తీర్ణంలో ఉన్నాయి. 1998కి ముందు పెద్ద సంఖ్యలో పందుల ఫారాలు ఉన్నా....వాటిని తొలగించారు. మాంసం, ఇతర ఆహార ఉత్పత్తుల కోసం చైనా, ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ తదితర దేశాలపై ఆధారపడుతున్నారు.

82 శాతం మంది ప్రభుత్వ అపార్టుమెంట్లలోనే

సింగపూర్ జనాభాలో 82 శాతం మంది ప్రభుత్వ అపార్టుమెంట్లలో కాపురం ఉంటున్నారు. హౌసింగ్ ఎస్టేట్లుగా పిలవబడే ఈ అపార్టుమెంట్లలో పాఠశాలలు, సూపర్‌మార్కెట్లు, క్లినిక్‌లు, హాకర్ సెంటర్లు, పాఠశాలలు, సేదతీరడానికి అవసరమైన సదుపాయాలు...ఇలా అన్ని వసతులతో సుఖవంతమైన, సౌకర్యవంతమైన జీవనం గడపడానికి వీలుగా ఉంటాయి. దేశ ప్రజలకు గృహ వసతి కల్పించడం కోసం ప్రభుత్వమే అపార్టుమెంట్లు నిర్మించడం ప్రారంభించింది. 1960లో ఏర్పాటైన హౌసింగ్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు (హెచ్‌డిబి) నాటి నుంచి నేటిదాకా ప్రజలకు అవసరమైన ఇళ్లను నిర్మించడంలో నిమగ్నమైవుంది. 1959లో పీపుల్స్ యాక్షన్ పార్టీ (పిఏపి) అధికారంలోకి రాగానే మొదట చేపట్టిన పని గృహ నిర్మాణమే. 1947లో అప్పటి బ్రిటీష్ హౌసింగ్ కమిటీ తన నివేదికలో 'ప్రపంచంలో అత్యంత దయనీయమైన మురికివాడలున్న దేశం సింగపూర్' అని పేర్కొంది. అలాంటి చోట ఆకాశ హర్మ్యాలను నిర్మించి రూపు రేఖలే మార్చేసింది అక్కడి ప్రభుత్వం. మొదట్లో అద్దెకు ఇవ్వడానికే అపార్టుమెంట్లు నిర్మించింది. ఆ తరువాత డబ్బులు చెల్లించిన వారికి యాజమాన్య హక్కులూ ఇచ్చింది. ఇప్పుడు ప్రభుత్వ అపార్టుమెంట్లలో ఉంటున్నవారిలో 90 శాతానికిపైగా తమ ఇళ్లను సొంతం చేసుకున్నారు. అపార్టుమెంటు కొనుగోలుకు 'సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్' ఆర్థిక చేయూతనందిస్తుంది. మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ఆదాయ వర్గాలను దృష్టిలో ఉంచుకుని వివిధ రకాల అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. రెండు నుంచి ఐదు గదులున్న ఫ్లాట్లు అందుబాటులో ఉంటాయి. ఎవరి ఆదాయాన్ని బట్టి వారు ఫ్లాట్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇక్కడ ప్రభుత్వ అపార్టుమెంటులో ఫ్లాటు తీసుకోవడం పేదరికానికిగానీ, తక్కువ స్థాయి జీవన ప్రమాణా లకుగానీ సంకేతం కాదట. ప్రైవేట్ బిల్డర్లకంటే హెచ్‌డిబి తక్కువ ధరతో ఫ్లాంట్లు ఇవ్వడం వల్ల ఎక్కువ మంది ప్రభుత్వ అపార్టుమెంట్లపైవే మొగ్గు చూపుతున్నారు. రెండు పడక గదులుండే ఫ్లాటు 400 – 480 చదరపు అడుగుల విస్తీర్ణముంటే....4 పడక గదులుండే ఇల్లు 1200 చదరపు అడుగుల దాకా ఉంటుంది. ప్రభుత్వ అపార్టుమెంట్లలో ఇచ్చే ఫ్లాటును అమ్ముకోవచ్చు. అయితే హెచ్‌డిబి నిబంధనలకు లోబడే ఉండాలి. అపార్టుమెంటును ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసినా...యజమానికి దానిపై 99 ఏళ్ల వరకే హక్కు ఉంటుంది.

పటిష్టమైన ప్రజారవాణా వ్యవస్థ

సింగపూర్‌కు భూభాగం పరిమితంగా ఉంది. మొత్తం 750 చదరపు కిలోమీటర్లు మాత్రమే. అందుకే భూమిని జాగ్రత్తగా ఉపయోగిస్తారు. ఇక్కడి భూభాగంలో 12 శాతం రోడ్ల కోసం ఉపయోగించారు. మరో 15 శాతం టౌన్‌షిప్పుల నిర్మాణానికి వినియోగించారు. మిగిలిన భూమి కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, ఇతర అవసరాలకు వాడాలి. అందుకే అక్కడ విచ్చలవిడిగా రోడ్లు నిర్మించరు. ప్రైవేట్ రవాణాపై ఆంక్షలతో పరిమితం చేస్తున్నారు. సింగపూర్ ప్రజల్లో 50

సింగపూరు సిరులకు దశా దిశ

మలేషియాతో కలిస్తే అభివృద్ధి సాధించవచ్చని ఆశించింది మొదట. అయితే అది విఫలమై మళ్లీ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన సింగపూర్‌కు దిక్కుతోచని స్థితి ఏర్పడింది. ఆ నాటికి దేశ జనాభాలో సగానికిపైగా నిరుద్యోగంతో బాధపడుతున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించడం, పారిశ్రామిక ఉత్పత్తిని పెంచడమే దీనికి పరిష్కారంగా భావించారు. దీంతో ప్రపంచ పెట్టుబడులను ఆహ్వానిస్తూ సింగపూర్ తలుపులు తెరిచారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కోసమే 1961లో ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఇడిబి) ఏర్పాటు చేశారు. తొలుత జురాంగ్ పారిశ్రామికవాడను అన్ని వసతులు, హంగులతో నిర్మించారు. పన్ను రాయితీ ప్రకటించి పెట్టుబడులను ఆకర్షించారు. ఇతర దేశాలతో పోల్చితే ఉత్పత్తి ఖర్చులో 33 శాతం ఆదా అయ్యే పరిస్థితులు కనిపించడంతో విదేశీ పెట్టుబడుదారులను సింగపూర్ అమితంగా ఆకర్షించింది. ఇదే సమయంలో సింగపూర్ ఎయిర్‌లైన్స్, సెంబవాన్ షిప్‌యార్డులు అభివృద్ధి చెందాయి. ఇక పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు సింగపూర్ ఒక భూతలస్వర్గంగా కనిపించింది (పెట్టుబడులను, పరిశ్రమలను ప్రోత్సహించే క్రమంలో కమ్యూనిస్టుల నేతృత్వంలోని కార్మిక సంఘాలను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. నాయకులను జైల్లో పెట్టారు. సమ్మెలు, కార్మికుల ఆందోళనలు లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేసింది. ఇవన్నీ సింగపూర్ పాలకుల చీకటి కోణాలు). 1970 మధ్యకాలానికే ప్రపంచంలోకెల్లా అతి పెద్ద మూడు చమురు శుద్ధి కర్మాగారాలు సింగపూర్‌లో నెలకొల్పారు.





సింగపూర్ చరిత్ర

క్రీస్తుపూర్వం 2500-1500 ఏళ్ల నుండే సింగపూర్ భూభాగంపై జన సంచారం ఉన్నట్లు ఆనవాళ్లున్నాయి. అయితే 18వ శతాబ్దం వరకు ఈ దీవి గురించి అంతగా తెలియదు. కీ.శ.1786లో బ్రిటీష్ వాళ్లు సింగపూర్ పక్కనేవున్న పెనాంగ్‌లో వాణిజ్య అవసరాలకు నౌకాకేంద్రం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటికీ సింగపూర్ వెలుగులోకి రాలేదు. 1819 జనవరిలో బ్రిటీష్ వాళ్లు అక్కడ అడుగుపెట్టారు. అదే సంవత్సరంలో బ్రిటీష్ పాలకులు సర్ స్టాంఫర్డ్ రాఫిల్స్ అనే సైనికాధికారిని సింగపూర్ దీవికి పంపారు. ఇతన్నే ఫాదర్ ఆఫ్ సింగపూర్‌గా పిలుస్తారు. అప్పటి సింగపూర్ పాలకుడైన హుస్సేన్‌షాకు రాయల్టీ చెల్లించే షరతుపై సింగపూర్ దీనివి రాఫిల్స్ బ్రిటీష్ పాలన కిందుకు తెచ్చాడు. 1819 ఫిబ్రవరి 6 నుంచి బ్రిటీష్‌వారి ప్రత్యక్ష ఏలుబడిలో ఉన్న సింగపూర్ 1959 జూన్3న లీకువాన్ యే ప్రధానిగా స్వయంప్రతిపత్తిగల దేశంగా ఆవిర్భవించింది. 1942-45 మధ్య రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జపాన్ ఈ దేశాన్ని ఆక్రమించినా తదనంతరం బ్రిటీష్ వారి పాలనలోనే కొనసాగింది. అయితే 1963లో సింగపూర్, మలయా, సబాహ్, సారవాక్ దేశాలు కలిసి ఉమ్మడి సామాఖ్యగా ఏర్పడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జాతుల మధ్య ఘర్షణలు తలెత్తడంతో మళ్లీ సింగపూర్ విడిపోయింది. 1965 ఆగస్టు 9వ తేదీ స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. అదే సంవత్సరం సెప్టెంబర్ 21 సింగపూర్‌కు ఐక్యరాజ్య సమితి సభ్యత్వం లభించింది. 1970లో సింగపూర్ అలీనోద్యమంలో చేరింది.

శాతానికిపైగా ప్రజా రవాణాపైనే ఆధారపడతారట. రోడ్డు, రైలు రవాణా ప్రధానమైనవి. ఏమూల నుంచి ఏమూలకైనా బస్సులు అందుబాటులో ఉంటాయి. ఉదయం 4.30 గంటల నుంచే అర్ధరాత్రి దాకా బస్సులు నడుస్తాయి. విద్యార్థులు, పనులకు, కార్యాలయాలకు వెళ్లేవారు ప్రజా రవాణానే ఆశ్రయిస్తారు. ప్రైవేట్ వాహనాలకు టాక్స్‌లు, పార్కింగ్ ఫీజులు ఎక్కువ చేయడం ద్వారా ప్రైవేట్ రవాణా వ్యవస్థను నిరుత్సాహపరుస్తున్నారు. కారు కొనుగోలు ధరకన్నా పన్నులు మూడు నాలుగు రెట్లు అధికంగా ఉంటాయి. వార్షిక రోడ్ టాక్స్ 40 శాతం దాకా ఉంది. దేశం మొత్తంగా చూసినా రోడ్లు పొడవు 3 వేల కిలోమీటర్లే. అయితే రోడ్లు విశాలంగా, వన్‌వేతో ఉంటాయి. రానున్న రోజుల్లో ప్రజా రవాణాను ఉపయోగించుకునేవారి సంఖ్యను 75 శాతానికి పెంచాలన్నది సింగపూర్ ప్రభుత్వ లక్ష్యం. మాస్ రాపిడ్ ట్రాన్సిసిస్ట్ (ఎమ్ఆర్‌టి) పేరుతో నడుస్తున్న రైలు వ్యవస్థకు 153 కిలోమీటర్ల ట్రాక్ ఉంది. దీని ద్వారానే అత్యధికులు ప్రయాణం సాగిస్తుంటారు. ఇంకా లైట్ రైల్ ట్రాన్సిస్ట్ పేరుతో ఉన్న రైళ్లు టౌన్‌షిప్పుల నుంచి ఎంఆర్‌టి రైల్ స్టేషన్లకు అనుసంధానం చేసివుంటాయి. 2007లో ఎక్స్‌ప్రెస్ మోనోరైల్ పేరుతో 2.1 కిలోమీటర్ల ట్రాక్ నిర్మించారు. ఇది కొత్తగా ఏర్పాటైన టౌన్‌షిప్పుకు వేసిన ట్రాక్. ప్రపంచ స్థాయిలో ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో సింగపూర్ ప్రజా రవాణా వ్యవస్థకు మొదటి స్థానం లభించింది. సింగపూర్ అనుభవం నుంచి మనం నేర్చుకోవాల్సింది...ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టపరచడం.

ఆర్థిక వ్యవస్థకు సేవా రంగమే జీవం

ప్రపంచంలోనే ఆర్థిక పరిపుష్టిలో 13వ స్థానంలో ఉన్న సింగపూర్ ఆర్థిక వ్యవస్థకు సేవా రంగమే జీవధారం. ఆ దేశ జాతీయ స్థూల ఉత్పత్తి (జిడిపి)లో పారిశ్రామిక రంగం వాటా 26.6 శాతంగా ఉంది. సేవా రంగం వాటా 73.4 శాతం. పరిమిత వనరులున్న సింగపూర్ జిడిపి ప్రపంచంలోని మూడింట రెండు వంతుల దేశాల కన్నా ఎక్కువ. దాని జిడిపి 300 బిలియన్ల అమెరికన్ డాలర్లుగా ఉంది. 40 ఏళ్ల నుంచి 8 శాతం వృద్ధి రేటును సాధిస్తోంది. సింగపూర్ ఆర్థిక వ్యవస్థకు ఊతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులే. ఇక్కడి విదేశీ పెట్టుబడుల్లో 57 శాతం అమెరికావే. అగ్రరాజ్యం అమెరికాకు సింగపూర్ 15వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ప్రస్తుతం ఈ దేశంలో మూడువేల బహుళ జాతి సంస్థలు వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పెట్రోలియం, ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌పోర్ట్, కెమికల్స్, ఆయిల్ డ్రిల్లింగ్ యంత్రాలు, రబ్బర్ ప్రాసెసింగ్, రబ్బర్ ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్, బేవరేజస్, ఓడల మరమ్మతు తదితర పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తుల్లో ఎలక్ట్రానిక్ పరిశ్రమ వాటా 48 శాతంగా ఉంది. నిర్మాణ రంగమూ ప్రాధాన్యత కలిగివుంది. టూరిజం కూడా సింగపూర్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఒక ప్రధాన కారణం. ఈ దేశ ప్రజల తలసరి ఆదాయం 51 వేల అమెరికన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచంలోనే ఎక్కువ తలసరి ఆదాయమున్న దేశాల్లో సింగపూర్ మూడో స్థానంలో ఉంది. మన దేశం 123వ స్థానానికి పరిమితమై ఉంది.

నిరుద్యోగం 1.9 శాతం!

సింగపూర్ జనాభాలో నిరుద్యోగులు రెండు శాతానికి లోపేనట. వస్తూత్పత్తి రంగంలో 15.5 శాతం, నిర్మాణ రంగంలో 13.7 శాతం, సేవా రంగంలో 70.1 శాతం, ఇతర రంగాల్లో 0.8 శాతం మంది పని చేస్తున్నట్లు 2013 గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం 34 లక్షల మంది ఉద్యోగులున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వేతనాలు కనీసంగా 3,700 సింగపూర్ డాలర్లు, గరిష్టంగా 5,100 సింగపూర్ డాలర్లుగా ఉన్నాయి. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లుగా ఉంది.

పర్యాటకం

సిరులొలికే సింగపూరులో పర్యాటక రంగం పెద్ద పరిశ్రమగా విరాజిల్లుతోంది. ఆ దేశ జనాభాకంటే ఏటా అక్కడికి వస్తున్న పర్యాటకుల సంఖ్య రెట్టింపుగా ఉందంటే అతిశయోక్తికాదు. ఆ దేశ ప్రజలు సేవా రంగంలో 70 శాతానికిపైగా పని చేస్తున్నారంటే... ఇందులో టూరిజం వాటానే ఎక్కువ. ఏటా కోటి మందికిపైగా సింగపూర్‌ను సందర్శిస్తున్నారు. ప్రధానంగా ఇండొనేషియా, చైనా, మలేషియా తదితర దేశాల పర్యాటకులే అత్యధికం. 2015 నాటికి పర్యాటకుల సంఖ్యను కోటి 70 లక్షలకు పెంచుకోవాలన్నది సింగపూర్ పర్యాటక సంస్థ లక్ష్యం. అదేవిధంగా పర్యాటక రంగ ఆదాయాన్ని 30 బిలియన్ డాలర్లకుకు పెంచాలని భావిస్తున్నారు. మెడికల్ టూరిజానికి సింగపూర్ కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. (సింగపూర్‌లో చూడదగ్గ విశేషాలపై చాలానే చెప్పవచ్చు. ఇప్పుడు ఆ అంశం జోలికి వెళ్లడం లేదు.)

సంస్కృతి

సింగపూర్‌లో పూర్వీకులైన మలాయ్ ప్రజలు, మూడవ తరానికి చెందిన చైనీయులు, విదేశీయులైన ఇండియన్లు, అరేబియన్లు, యూరోపియన్లు నివసిస్తున్న కారణంగా ఇక్కడ విశ్రమ సంప్రదాయాలు కనిపిస్తాయి. కులాంతర, మతాంతర వివాహాలు ఇక్కడ మామూలే. వివిధ మతాల ఆలయాలు వీరి మిశ్రమ మత సంప్రదాయానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ఇక్కడ వారివారి ప్రత్యేక హోటళ్లలో వారి సంప్రదాయక ఆహారం లభిస్తుంది.

కొత్త పుంతలు

సింగపూర్ అభివృద్ధి 1980 దశకం నుంచి కొత్తపుంతలు తొక్కింది. దేశ ఆధునికీకరణపై దృష్టి సారించింది. పరిశ్రమలను నవీకరించింది. మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టింది. 1981లో సింగపూర్ షాంఘై వినామాశ్రయాన్ని ప్రారంభించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ అతి పెద్ద ఎయిర్ లైన్స్‌గా ఆవిర్భవించింది. దీంతో పర్యాటక పరిశ్రమ వృద్ధి చెందడం మొదలయింది. అలాగే దేశ ప్రజలకు అవసరమైన నివాస గృహాలను నిర్మించింది. దీంతో అధునాతన టౌన్‌షిప్పులు రూపుదాల్చాయి. అంగ్ మో కిమో వంటి నూతన పట్టణాలు ఉనికిలోకి వచ్చాయి. సింగపూర్ రవాణా వ్యవస్థలో కీలకంగా ఉన్న మాస్ రాపిడ్ ట్రాన్సిస్ట్ 1987లో ప్రారంభమయింది. నగర కేంద్రాలను, నివాస ప్రాంతాలనూ కలుపుతూ ఏర్పాటైన ఈ వ్యవస్థ సింగపూర్ రూపురేఖలనే మార్చేసింది.

విద్యా విధానం

ఇక్కడ ప్రాథమిక విద్య ఆరో సంవత్సరం నుంచి మొదలవుతుంది. మనకు ప్రీ నర్సరీ, నర్సరీ పాఠశాలల్లాగే అక్కడా కిండర్ గార్డెన్ పేరుతో ప్రైవేట్ పాఠశాలలున్నాయి. 50 శాతం మంది విద్యార్థులు ఈ కిండర్ గార్డెన్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలోనే చదవుతు ప్రారంభిస్తున్నారు. మొదటి భాషగా ఇంగ్లీషు, రెండో భాషగా ఇతర భాషలు ఉంటాయి. కిండర్ గార్డెన్ తరువాత ఆరేళ్ల ప్రాథమిక విద్య, ఆపై నాలుగేళ్ళు మాధ్యమిక విద్య ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ నిధులతో నడిచే పాఠశాలలు, ప్రజాసంస్థల సహకారంతో నడిచే పాఠశాలలు, స్వతంత్ర పాఠశాలలు, విశేషాధికారాలు కలిగిన పాఠశాలలు...ఇలా పలు రకాల పాఠశాలలున్నాయి. విద్యా వ్యవస్థపై ప్రభుత్వానికి సరైన నియంత్రణ లేదన్న విమర్శలున్నాయి.

మంచినీళ్లు దిగుమతి చేసుకోవాల్సిందే...

ఇంతగా అభివృద్ధి చెందిన సింగపూర్ మంచినీళ్లు దిగుమతి చేసుకుంటోందంటే ఆశ్చర్యంగా అనిపించవచ్చు. సముద్రం మధ్యలోవున్నా ఆ నీళ్లు తాగేందుకు ఉపయోగపడవు. అందుకే మలేషియా నుంచి పైపులైను ద్వారా మంచినీటిని దిగుమతి చేసుకుటోంది. దీనికి సంబంధించిన ఒక ఒప్పందం 2011లో ముగిసింది. మరో ఒప్పందం 2061 దాకా ఉంది. నీటి వనరులను వృద్ధి చేసుకోవడం, సముద్ర జలాలను మంచినీటిగా మార్చడం ద్వారా తమ అవసరాల్లో 30 శాతం నీటిని దేశంలోనే సమకూర్చుకుంటోంది. వాననీటిని వడిసి పట్టేందుకు 17 రిజర్వాయర్లు నిర్మించింది.

కరెంటు, గ్యాసు, నీళ్లకు పబ్లిక్ యుటిలిటీ బోర్డు

నీళ్లు, గ్యాసు పైపులైన్ల ద్వారా సరఫరా అవుతాయి. కరెంటు, గ్యాసు, నీటి సరఫరా ఈ మూడు వ్యవహారాలను చూసేందుకు అక్కడ పబ్లిక్ యుటిలిటీ బోర్డు ఉంటుంది. కరెంటుకు కిలోవాట్‌కు 14.97 సెంట్లు చెల్లించాలి. గ్యాస్‌కు యూనిట్‌కు 12.23 సెంట్లు బిల్లు చేస్తారు. నీటి విషయానికొస్తే...క్యూబిక్ మీటరు నీటికి 1.30 సింగపూరు డాలర్లు చెల్లించాలి. ఇది నెలకు 20 క్యూబిక్ మీటర్ల నీటిని వాడేవారికి మాత్రమే. అంతకు మించితే...ఎక్కువ బిల్లు చెల్లించాలి. అంటే మన కరెంటు ఛార్జీలులాగా స్లాబ్ పద్ధతన్నమాట. విద్యుత్, గ్యాస్, మంచినీటి సరఫరా 24 గంటలూ ఉంటుంది.

వ్యాపార కేంద్రాలు

సింగపూర్ దక్షిణాసియా వ్యాపార స్థావరం వంటిదని చెప్పుకోవాలి. మరీనా బే, బ్యుగిస్ స్ట్రీట్, చైనాటౌన్, గెవ్లాంగ్ సెరై, కాంపాంగ్ గెలాం, అరబ్ స్ట్రీట్, లిటిల్ ఇండియా, నార్త్ బ్రిడ్జి రోడ్డు, ఆర్చర్డ్ రోడ్, ది సబర్బ్స్....అనేక వ్యాపార కేంద్రాలున్నాయి. ఆర్చర్డ్ రోడ్‌లో అయితే బహుళ అంతస్తుల షాపింగ్ మాల్స్ లెక్కేలేదు. పెద్దపెద్ద హోటళ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. వీటితో పాటు డౌన్‌టౌన్ కోర్, వినోసిటీ కేంద్రాలూ ఉన్నాయి. సింగపూర్‌లో పర్యటించేవారు ఈ ప్రాంతాల్లోనే షాపింగ్ చేస్తుంటారు. పర్యాటకుల కోసమే ప్రతి ఏటా గ్రేట్ సింగపూర్ సేల్ పేరుతో ఓ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తారు. సింగపూర్ పర్యాటక సంఘం లేట్ నైట్ షాపింగ్‌ను 2007 నుంచి నిర్వహిస్తోంది. శనివారం రాత్రి ప్రత్యేకమైన రాయితీలు, ప్రోత్సాహకాలను దుకాణాలు ప్రకటిస్తాయి. ఈ దేశంలో వ్యభిచారానికి లైసెన్సులు ఇచ్చారు.

ఆకాశ హర్మ్యాలు

సింగపూర్‌లో భవనాలు...ఆకాశాన్ని తాకుతున్నట్లు కనిపిస్తాయి. ఎటు చూసినా ఎత్తయిన భవనాలే దర్శనిమిస్తాయి. ఇవే సింగపూరు సొగసులకు కొత్త అందాలను అద్దుతున్నాయి. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేవి ఇవే. భవనాలన్నీ ఇంత ఎత్తుగా నిర్మించడానికి కారణం భూమి సమస్యే. వాణిజ్య కార్యకలాపాల కోసం నిర్మించిన భవనాలేగాదు...ప్రజల నివాసాల కోసం నిర్మించినవీ బహుళ అంతస్తులతో నిటారుగా ఉంటాయి. భవన నిర్మాణాలను సివిల్ ఏవియేషన్ ఆఫ్ సింగపూర్ పర్యవేక్షిస్తుంది. ఇక్కడ నిబంధనల ప్రకారం 280 మీటర్ల ఎత్తుకు మించి ఏ భవనమూ ఉండకూడదు. రిపబ్లిక్ ప్లాజా, యుఓబి ప్లాజా ఒన్, ఓయుబి సెంటర్...మూడు అత్యంత ఎత్తయిన నిర్మాణాలుగా గుర్తింపు పొందాయి.

★

సైన్యంలో పని చేయాల్సిందే

సింగపూర్‌లో ప్రతి పౌరుడూ ఆ దేశ ఆర్మీలో పని చేయాల్సిందే. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన యువకులు సింగపూర్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ లేదా పోలీస్ ఫోర్స్ లేదా సివిల్ డిఫెన్స్ ఫోర్సుల్లో ఏదైనా ఒకదాంట్లో కనీసం రెండేళ్లు పని చేయాలని నిర్బంధం చేశారు. నేటికీ ఇది అమల్లో ఉంది. దీన్ని ధిక్కరించి విదేశాలకు వెళితే ... ఇక వారికి సింగపూర్‌లోకి ప్రవేశం ఉండదు. అనారోగ్య సమస్యలు వున్నవారికి ఈ నిబంధనలో సడలింపు ఉంది. ప్రస్తుతం 3,50,000 మంది రిజర్వ్‌లో ఉండగా 72 వేల మంది పూర్తికాలం ఆర్మీలో పని చేస్తున్నారు.

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

కోలోన్, 1842

హైన్రిష్ మరణం తర్వాత మూడేళ్లపాటు బెర్లిన్‌లోని మార్క్స్ నివాసం యంగ్ హెగెలియన్లకు కేంద్రమైంది. తను చదవాల్సిన కోర్సులన్నీ మానేసి కేవలం వీళ్లతోనే గడిపాడు కార్ల్ మార్క్స్. అయితే, ఆర్థికంగా పరిస్థితి దిగజారింది. పెరిగిన ఖర్చుల కోసం డబ్బు పంపటానికి తల్లి నిరాకరించింది. ఉన్నదంతా ఒక్కడికే పెట్టేస్తే ఎలా? మరో ఆరుగురు పిల్లలున్నారు తన మీద ఆధారపడి. జెన్నీ అన్నయ్య ఫెర్డినాండ్ (లుడ్విగ్ మొదటి భార్య కుమారుడు. వయసులో జెన్నీ కన్నా పదిహేనేళ్లు పెద్దవాడు. జెన్నీ – కార్ల్‌ల పెళ్లి ప్రతిపాదనను వ్యతిరేకించినవాడు కూడా. కార్ల్ మీద ఓ కన్నేసి వుంచాడు.) తను నిరాకరించినా, తండ్రి జెన్నీ కోరికను మన్నించటంతో, బెర్లిన్‌లోని తన పలుకుబడిని ఉపయోగించి కాబోయే బావమరిది కదలికల మీద నిఘా పెట్టాడు. నాస్తికులు, సంస్కరణవాదులు, ప్రజాస్వామ్యవాదులు, సోషలిస్టులతో చెట్టాపట్టాలేసుకొని తిరుగు తున్నాడు కార్ల్. వీళ్లందరూ అత్యంత ప్రమాద కరమైన రాడికల్స్. అతడికి ఈ కార్యకలాపాల మీద వున్న శ్రద్ధ, పెళ్లి తర్వాత భార్యా పిల్లల కోసం మంచి ఉద్యోగం సంపాదించుకోవటంలో లేదు. క్లాస్ రూంలలో కూర్చోవటానికి బదులు కేఫ్‌లలో, బీర్ బార్‌లలో గడుపుతున్నారు. ఫెర్డినాండ్ గాఢంగా విశ్వసించిన మతం (చర్చ్), రాజ్యాధికారం, కుటుంబ వ్యవస్థకు పూర్తి వ్యతిరేకం కార్ల్ మార్క్స్. కాని లుడ్విగ్ ఆశీర్వాదం వున్నంతవరకూ, కార్ల్, జెన్నీల సంబంధానికేమీ ప్రమాదం లేదు. అయినప్పటికీ, భవిష్యత్తులో ఉపయోగించవచ్చునని, కార్ల్‌కు వ్యతిరేకంగా సేకరించిన సమాచారాన్ని జాగ్రత్తగా భద్రపరిచాడు ఫెర్డినాండ్. కనీసం, తరువాతైనా తన చెల్లెలు వాస్తవాన్ని గ్రహించలేకపోతుందా!



“ ఇక్కడి ప్రజల్ని మీరు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఎవరూ మీకు ఏ ఆర్థిక సహాయమూ చెయ్యరు. నువ్వు రాజకీయాల్లో ప్రవేశించాలనుకుంటున్నావు. ఇది చాలా ప్రమాదకరమైన రంగం. డియర్ లిటిల్ కార్ల్! ఇంటి దగ్గర నీ కోసం నీ ప్రేయసి బెంగ పెట్టుకున్నది. నీతోనే తన జీవితమనుకుని క్షణమొక యుగంగా గడుపుతున్నది. ”

ఈలోగా, జెన్నీ – కార్ల్‌ల మధ్య దూరం పెరిగినా, సుదీర్ఘమైన లేఖలతో ఒకర్నొకరు ఓదార్చుకున్నారు. ఎవరెన్ని సమస్యల గురించి ప్రస్తావించినా, అన్నింటా అంతర్లీనంగా ధ్వనించింది అణచుకోలేని విరహమే. ప్రతి లేఖలో విషాదాంత నాటకాలలోని నాయికా నాయకుల స్వగతాలే.

ఇక, రాజకీయపరంగా, కార్ల్ గురించి ఫెర్డినాండ్‌కు తెలిసిన విషయాలన్నీ జెన్నీకి కూడా తెలుసు. కానీ, ఆమెకు ఆ చర్యలు అంగీకారమే. తన తండ్రి, తన ప్రేమికుని వాదనలు విన్న తర్వాత ఈ లోకాన్ని మార్చి, మెరుగైన భవితకు బాటలు వేయటం సాధ్యమేనని ఆమెకు నమ్మకం కలిగింది. తనూ ఈ బృహత్ ప్రయత్నంలో భాగం పంచుకోవాలి. ఏ పనీ ఆషామాషీగా చెయ్యటం ఆమె స్వభావంలోనే లేదు. చదవటానికి కొన్ని పుస్తకాలు సూచించమని కార్ల్‌కు రాసింది. ‘మంచి పుస్తకాలు, తెలుసుకోవలసిన పుస్తకాలు, కథలూ, కవిత్వం కాదు. ఇప్పుడు వాటిని చదివే ఓపిక లేదు. పుస్తకాలు కాస్త కఠినంగా వున్నా సరే కష్టపడి అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాను’.

మూలం : మేరీ గేబ్రియెల్ ‘లవ్ అండ్ కేపిటల్’

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

1840లో, తండ్రి మరణం తర్వాత, ఫ్రీడ్రక్ విల్హెమ్ IV ప్రష్యా సింహాసనం అధిష్టించాడు. తండ్రి పాతకాలం వాడు. ఫ్రెంచివాళ్లతో యుద్ధాలు చేశాడు. విప్లవ భావాలకూ, నెపోలియన్‌కూ వ్యతిరేకం. కాని కొడుకుది కొత్త తరం.

అభ్యుదయ భావాలు గలవాడు. నలభై అయిదేళ్లు. ఆవిర్భవిస్తున్న బూర్జువా వర్గం అతడి మీద గంపెడాశ పెట్టుకొంది. ప్రజాస్వామ్యం దిశగా సంస్కరణలు జరగాలి. పారిశ్రామిక, ఆర్థిక రంగాలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పాలసీలు వుండాలి. వాణిజ్య వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోతే జర్మనీ, యూరోప్ కన్నా వెనకబడిపోయే అవకాశం లేకపోలేదు. అయితే, మార్క్స్ లాంటివాళ్లకు రాజరిక వ్యవస్థంటేనే గౌరవం లేదు. ఈ కొత్త రాజు ప్రెస్సు మీదా, పబ్లిషర్ల మీదా ఆంక్షలు తొలగిస్తాడని మాత్రం ఆశలు పెట్టుకున్నారు కొందరు. కనీసం భావ ప్రకటనా స్వేచ్ఛ లభించినా చాలు.

సంస్కరణల కోసం వివిధ వర్గాల నుండి ఒత్తిడి పెరిగినా, రాజుగారు వాటిని ఖాతరు చేయలేదు. అతని ఆస్థానంలో, ఉన్నతోద్యోగాలలో వున్న

వాళ్లంతా అరిస్టోక్రాట్లు, సైనికాధికారులే. అంటే, పరిపాలనా విషయంలో, తండ్రి కాలం నాటికీ, ఇప్పటికీ తేడా లేదు. ప్రాంతీయ శాసనసభలను ఏర్పాటు చేసి, తన బాధ్యత తీరిందనుకున్నాడు. అయితే, శాసనసభల్నయితే అనుమతించాడు గాని, వాటికి అధికారాలివ్వలేదు. ప్రజలలో కొందరు దైవాంశ సంభూతుడైన రాజు గారి అధికారాన్నే ప్రశ్నిస్తున్నారు గనక, వాళ్లు ఇంతకన్నా ఎక్కువ స్వేచ్ఛకు అర్హులు కారు. తను చేసిందే చట్టం. ఇంకా చట్టసభలెందుకు? నిరసనలు పెరిగితే, నిర్దాక్షిణ్యంగా అణచివేయాల్సిందే. ప్రెస్ మీదా, వాక్ స్వాతంత్ర్యం మీదా ఆంక్షలు విధిస్తాడు. ఫలితంగా, యూనివర్సిటీల నిఘా పెరిగింది. ఒక రచయిత చెప్పినట్టుగా, 'అవి సైనిక శిబిరాలను తలపించాయి', యంగ్ హెగెలియన్‌లు ప్రభుత్వం విసిరిన సవాలును స్వీకరించారు. కానీ అధికారం ముందు వాళ్లెంత!

రియాక్షనరీగా మారిన బెర్లిన్ యూనివర్సిటీ తనకిక డిగ్రీ ఇవ్వదనే భయంతో మార్క్స్ తన థీసిస్ 'Difference Between The Democritean and Ebicuxan philosophy of Nature'ను జెనా యూనివర్శిటీకి సమర్పించాడు. ఒక చిన్న జర్మన్ రాష్ట్రంలో వున్న ఈ యూనివర్సిటీ ఒక డిగ్రీ ఫ్యాక్టరీ. పోస్ట్ ద్వారా కూడా డాక్టరేట్లు ఇచ్చింది. 1841లో ఏప్రిల్ 6న తన థీసిస్ సమర్పించిన మార్క్స్, వారం రోజుల తర్వాత, అంటే ఏప్రిల్ 15నాడు 'డాక్టరేట్ ఇన్ ఫిలాసఫీ' పత్రం అందుకున్నాడు. ఈ థీసిస్‌ను లుడ్విగ్ వాన్ వెస్ట్‌ఫాలెన్‌కు అంకితమిచ్చాడు మార్క్స్ "పితృ సమానులైన మీకు ప్రేమతో... ఆదర్శవాదం కేవలం ఊహ కాదు. అదే సత్యం అనటానికి మీరే నిదర్శనం."

బెర్లిన్ యూనివర్సిటీకి తిరిగి చేరుకున్న బ్రూనో బార్ లెక్చరర్‌గా మార్క్స్‌కు ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. కానీ మతాధికారులను రాజ్య వ్యవహారాలలో వాళ్ల పాత్రను విమర్శించడం వల్ల అతని ఉద్యోగమే ప్రమాదంలో పడింది. 1841 వేసవిలో ప్రష్యన్ మినిష్టర్ ఫర్ రిలిజన్ అండ్ ఎడ్యుకేషన్ బార్‌కు వ్యతిరేకంగా అనేక ప్రకటనలు జారీ చేశాడు. అతడి అనుయాయుడిగా వున్న మార్క్స్‌మీద కూడా దీని ప్రభావం పడింది. ఫలితంగా ఇక ప్రష్యాలో ఎక్కడా ఉపాధ్యాయ వృత్తి చేపటట్టానికే అవకాశం లేకుండా పోయింది.

మార్క్స్‌కు ఇరవైమూడు. జెన్నీకి ఇరవై ఏడు. అప్పటికి ఆమె సుమారు అయిదేళ్లు అతడి కోసం నిరీక్షించింది. కానీ మార్క్స్‌కు ఉద్యోగం దొరికిందాకా వాళ్లు ఒక్కటయ్యే అవకాశం లేదు. న్యాయశాస్త్రం అభ్యసించటానికి యూనివర్సిటీలో చేరాడు మార్క్స్. కానీ వాటిమీద ఒక్కనాడూ శ్రద్ధ పెట్టలేదు. ఏది ఏమైనా ఆ రంగంలో ఇప్పటికే వందలాది మంది పోటీ పడుతున్నారు. అసలు జర్మనీలోనే నిరుద్యోగ సమస్య అధికంగా ఉంది. ఇక విద్యావంతులైన నిరుద్యోగులకు మిగిలింది చేసే అవకాశం. అది జర్నలిజంలో అన్నింటికన్నా తక్కువ వృత్తిగా పరిగణిస్తారు దాన్ని. ఒక చరిత్రకారుడు వర్ణించినట్టుగా, 'పరువు మర్యాదల్ని పట్టించుకోనివాళ్లు, నిలకడ లేనివాళ్లు, పైపై మెరుగులకు ఆశపడేవాళ్లు ఈ వృత్తిని ఎంచుకుంటారు'. ఇక జీతాలు కూడా అంతంతమాత్రమే. అదీ ఒకవేళ ఎవరైనా దయదలచి ఇస్తే! అయితే మార్క్స్ ముందర పెద్దగా ప్రత్యామ్నాయాలు లేవు.

'ప్రతిఘటనకు విద్యావంతుల ప్రథమ ఆయుధం వార్తా పత్రిక'. అప్పటికి మార్క్స్ కేవలం కొన్ని గీతాలు మాత్రమే ప్రచురించాడు. కానీ ధిక్కార స్వరం మాత్రం ఇంకా వినిపించలేదు.

1841లో రాసే అవకాశాలను వెదుక్కుంటూ ట్రీయర్, బాన్, కొలాన్ నగరాలను చుట్టి వచ్చాడు మార్క్స్. ఈ కాలంలో అతను ఎక్కువ కాలం (ఆరు వారాలు) గడిపింది ట్రీయర్‌లోనే. ఇన్నాళ్లూ జెన్నీతో తన ఎంగేజ్‌మెంట్ ఒక రహస్యం. ఇప్పుడు కాబోయే దంపతులుగా చెట్టాపట్టాలేసుకొని తిరిగి అందర్నీ ఆశ్చర్యపరిచారు. కొన్ని పుకార్లు కూడా వ్యాపించకపోలేదు. యవ్వనంలో మార్క్స్ అందంగా వున్నాడని అంగీకరించిన ఏకైక వ్యక్తి జెన్నీ. మార్క్స్ జీవిత చరిత్ర రాసిన ఒక పండితుడు, ట్రీయర్‌లోని మార్క్స్ పరిచయస్తుణ్ణి ఉటంకిస్తూ 'అంతటి unattractive యువకుణ్ణి ఎవరూ చూసి ఉండరు" అన్నాడు. మనిషి బాక్సర్‌లాగ బలిష్టంగా ఉంటాడు. పెరిగిన గడ్డంతో, కాస్త అశ్రద్ధగా డ్రెస్ చేసుకుని, మొరటుగా కనిపిస్తాడు. మంచి లాంగ్ కోట్ వేసుకున్నప్పటికీ, బొత్తాములు సరిగ్గా పెట్టుకోడు. మర్యాదను అతిక్రమించి పెరిగిన నల్లటి గడ్డం, ఎప్పుడూ నోటిలో కనిపించే సిగార్ అతడికి – ఆనాటి ప్రష్యన్ పద్ధతుల ప్రకారం – ఓ తీవ్రవాదం రాడికల్‌గా గుర్తింపు తెచ్చాయి (మర్యాదస్తులు ఇళ్లలో పైపులు కాలుస్తారు). ఒక్క మాటైనా మాట్లాడకుండానే కేవలం తన వస్త్రధారణ, తన ప్రవర్తన ద్వారా సాంప్రదాయ సమాజాన్ని ధిక్కరించాడు మార్క్స్. ట్రీయర్ వీధుల్లో తను తిరుగుతున్నప్పుడు పక్కన నడుస్తుంటే జెన్నీ – సన్నగా, పొడుగ్గా, ఘరానా ఇంటి హుందాతనంతో... ఎర్రటి జుత్తు... పొడుగాటి మెడలో ఒంటిపేట ముత్యాలహారం. ఆమె ఎంతటి అందగత్తె అంటే, ఆమె ధరించిన దుస్తుల్ని కూడా ఎవరూ గమనించే వాళ్లు కారు. అయినప్పటికీ, మంచి పెంపకంలో పెరిగిన జెన్నీ, ట్రీయర్‌లో లభ్యమైన అత్యుత్తమ డ్రెస్సుల్నే ధరించేది. చూపరులకు – మక మోహిని, ఒక వెగటు పుట్టించే యువకుడు (అనుమానించదగిన వ్యక్తి కూడా) పక్కపక్కనే నడుస్తూ కనిపిస్తారు.

తమ శరీరాకృతుల గురించి ఎవరేమనుకున్నా జెన్నీ పట్టించుకోలేదు గానీ, ఇద్దరి వయసులో తేడా, ముఖ్యంగా మార్క్స్‌కు ఇంకా ఠికాణా లేకపోవడం ఆమెను ఆందోళనకు గురిచేశాయి. అయినా తన భయాన్నెప్పుడూ ఆమె పబ్లిగ్గా వ్యక్తం చేయలేదు. కానీ, కార్ల్ మార్క్స్‌కు ఇవేమీ పట్టవు. అవకాశాలు దొరికినా, దొరక్కపోయినా, ఆశలకూ, భవిష్యత్ ప్రణాళికలకూ కొదవలేదు. సంపన్నులైన ఉదారవాదులకూ, ప్రజాస్వామ్యవాదులకూ రాజుగారు తమను తెలిసీ తెలియని చిన్నపిల్లల్లా చూడటం విసుగు తెప్పించింది. 'అందరూ' దైవేచ్ఛ ఎలా వుంటే అలా జరుగుతుంది' అనుకోవటం పాత వ్యవస్థకు మరణ శాసనమే' అని గ్రహించాడు మార్క్స్.

రాజకీయ చర్చల మీదా, రాజకీయ పార్టీల మీదా వున్న ఆంక్షల్ని అధిగమించటాని మేధావులు తమ చర్చలకు మతపరమైన, తాత్వికమైన ముసుగులు తొడిగారు. తరచూ, 'సాహిత్య, లేదా తాత్విక సంఘాలు' అనబడే బృందాల్లో సమావేశమయ్యారు. మార్క్స్, అతని అనుచరులకూ, మతాన్ని, విమర్శించటమంటే, రాజ్యాంగ వ్యవస్థలో అది పోషిస్తున్న పాత్రను విమర్శించటమే. కుళ్లిపోయిన ఈ వ్యవస్థను సమర్థించటానికి నియంతలు, క్రీస్తు అనబడే సజ్జనుడి పేరు దుర్వినియోగం చేస్తున్నారని వాదించారు మార్క్స్ బృందం. అందువల్ల, అది ఆలంబనగా వున్న రాజ్యంలాగా, మతం కూడా అవినీతిమయమైపోయింది. మార్క్స్, బ్రూనో, బార్ కలిసి 'నాస్తిక ఆర్కైవ్స్' అనబడే పత్రిక తేవాలనుకున్నారు. కానీ డబ్బులు కావాలిగా. ట్రీయర్‌లోని సంపన్నులందర్నీ సంప్రదించాడు మార్క్స్. అతడి ప్రయత్నాలకు జెన్నీ స్పందించింది.

'ఇక్కడి ప్రజల్ని మీరు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఎవరూ మీకు ఏ ఆర్థిక సహాయమూ చెయ్యరు. నువ్వు రాజకీయాల్లో ప్రవేశించాలనుకుంటున్నావు. ఇది చాలా ప్రమాదకరమైన రంగం. డియర్ లిటిల్ కార్ల్! ఇంటి దగ్గర నీ కోసం నీ ప్రేయసి బెంగ పెట్టుకున్నది. నీతోనే తన జీవితమనుకుని క్షణమొక యుగంగా గడుపుతున్నది.

ఎప్పుడూ ప్రయాణాల్లో వుండే కార్ల్‌ను ఆమె, 'డియర్ లిటిల్ మాన్ ఆఫ్ డైల్వేస్' అనీ, 'మై డియర్ వైల్డ్ బోర్ (అడవి పంది) అనీ ముద్దుగా సంబోధించింది. అతడితో జీవితం కోసం ఆమె మానసికంగా సిద్ధపడింది. ఇక తాము భార్యాభర్తలే.

ఎంగేజ్‌మెంట్ తర్వాత, ఇన్నేళ్లు గడిచినా, ఇప్పుడామె భవిష్యత్తంతా మార్క్స్‌తో జరిగే పెళ్లిమీదే ఆధారపడి ఉంది. కానీ, ఆమె జీవితాన్ని మలుపు తిప్పే ఈ క్షణాన తండ్రి తమ బంధాన్ని ఆశీర్వదిస్తాడన్న నమ్మకం అడుగంటింది.

సశేషం

ఫోన్: 91776 18708

◆ కొత్త పుస్తకాలు

ప్రపంచీకరణ - సంస్కృతి

పేపర్ రహిత మంత్రివర్గ సమావేశం జరపగలిగిన 'హైటెక్' ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... రాజధాని నిర్మాణం కోసం అత్యంత 'లోటెక్' విద్యయైన, పురాతన కాలపు 'వాస్తు' ఆధారంగా రాజధాని నిర్మాణానికి ఎందుకు ప్రయత్నిస్తున్నాడు? అంగారక గ్రహాన్ని అందుకోవటానికి రాకెట్ ప్రయోగిస్తున్న శాస్త్రవేత్తలు 'రాకెట్ నమూనా'కు అంకాళమ్మ గుడిలో పూజలెందుకు చేయిస్తున్నారు? ఉన్నతమైన భారతీయ సంస్కృతి, మహిళలను గౌరవించే, పూజించే దేశంలో విచక్షణారహితంగా, విలువల పతనంగా అత్యాచారాలెందుకు జరుగుతున్నాయి? ఎందుకు పెరుగుతున్నాయి? శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందే కొలదీ శాస్త్రీయ భావాలు పెంపొందాల్సిన స్థానంలో మూఢ విశ్వాసాలెందుకు పెరుగుతున్నాయి? ప్రేమ నుండి పెళ్లి నిర్వహణ వరకూ ఓటు నుండి విశ్రాంతి సమయం వరకూ సరుకులు ఎలా మారిపోయి, అన్నీ లాభం చుట్టూ ఎందుకు తిరుగుతున్నాయి? స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికే ఉన్నానన్న మీడియా ఎందుకు కొద్దిమంది గుత్తాధిపతుల చేతుల్లో బందీ అయ్యింది?



ప్రపంచీకరణ - సంస్కృతి, సంకలనం : తెలకపల్లి రవి, పేజీలు : 128, ధర రూ.80/- ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర హైదరాబాద్ - 20. ఫోన్ : 040-27660013

మనల్ని నిరంతరం వేధిస్తున్న, ఆవేదనకు గురిచేస్తున్న అనేక ప్రశ్నలకు ఇక్కడ సమాధానం దొరుకుతుంది. మనకు కొత్త దారి దొరుకుతుంది.

ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇటీవల ప్రచురించిన 'ప్రపంచీకరణ – సంస్కృతి' పుస్తకంలో పై ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుంది. దేశవిదేశాల్లో ప్రజా జీవితంలో కృషి చేస్తున్న చేసిన 15 మంది రచయిత వ్యాసాల, ఉపన్యాసాల సంకలనం ఈ పుస్తకం. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘటనల పట్ల ఆవేదన చెంది, నిరాశపడుతున్న మనకు నడుస్తున్న చరిత్రను, జరుగుతున్న ఘటనలను విశ్లేషణ చేసుకోవటానికి ఈ పుస్తకం సహాయపడుతుంది. సరైన సమయంలో ఈ పుస్తకాన్ని ప్రచురించినందుకు ప్రజాశక్తి బుక్‌హౌస్‌కు అభినందనలు తెలపాలి. 'జేమ్స్ పెట్రాస్' నుండి వకుళాభరణం రామకృష్ణ వరకూ, గోర్కీ నుండి సీతారాం ఏచూరి వరకూ ఆయా రంగాలలో అనుభవజ్ఞులైన వ్యక్తుల కలం నుండి, గళం నుండి వెలువడిన ఈ వ్యాసాలు ఎంతో విలువైన సమాచారాన్ని, విశ్లేషణను అందిస్తాయి. అనువాదాలు సరళంగా అర్థమయ్యే విధంగా ఉన్నాయి. కొత్త సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి జరిగే ప్రయత్నానికి ఈ 'ప్రపంచీకరణ– సంస్కృతి' పుస్తకం దోహదపడుతుంది.

- కారుసాల

కవులకు కరదీపిక

కవిత్వం, బాల సాహిత్యం, నవలలు, సాహిత్య విశ్లేషణలు, నాటికలు, సినిమా, సైన్సు, అనువాద రచనలు .... ఇలా బహుముఖ సాహితీ కృషి నాలుగు దశాబ్దాలుగా చేస్తున్నారు డాక్టర్ దేవరాజు మహారాజు.

సామాజిక జీవనంలో వైజ్ఞానిక స్పృహ కలిగించిన వీరు... మూఢ నమ్మకాలపై సైన్స్ పరంగా విశేష కృషి చేశారు. కవిత్వంలో సమాంతర రేఖలు... సంక్షోభాలు.. అంశాల్ని రేడియో ప్రసంగాలుగా ఈ పుస్తకం విడుదల చేశారు. అనువాద రచనలు, సాహిత్యం గురించి సాధికారికంగా మాట్లాడగల, రాయగలవారిలో డా॥ దేవరాజు మహారాజు ఒకరు. మూలం – అనువాదం – సమాంతరంగా సాగే రెండు సరళ రేఖల వంటివి. మూలం ఎలా సాగితే అనువాదం అలా సాగాలి అంటారు.

ఈ వ్యాసాలు భారతీయ కవిత్వంతో, ప్రపంచ కవిత్వంతో చిన్నపాటి పరిచయం చేయగలుగుతాయి. పాబ్లో నెరూడా చిలీలో పుట్టిన లాటిన్ అమెరికా కవి, నోబెల్ గ్రహీత (1904–1973) రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరి తన దృక్పథాల్లో మార్పుల్ని కవిత్వీకరించాడు. వారి కవిత్వాన్ని తెలుగులో పరిచయం (పేజీ. 7) పాఠకుల్ని అలరిస్తుంది..." పదాల ఆకృతి – మానవాకృతి లాంటిదేననుకుని నేను పదాల మీదగా వెళ్లిపోతాను..."

కవిత్వంలో సమాంతర రేఖలు-సంక్షోభాలు (రేడియో ప్రసంగాలు), రచన : డా॥ దేవరాజు మహారాజు. పేజీలు : 110, వెల : 110/-, ప్రతులకు : జి. 1. నల్లగండ్ల - గోపనపల్లి - రోడ్ హెచ్.సి.యు, హైదరాబాద్ - 46.

అనువాద ప్రక్రియతో కవిత్వం విశ్వవ్యాప్తం అంటారు దేవరాజు మహారాజు. ఏ దేశకవి ఏమి చెప్పారో కూడా రాస్తారు. ఉదా చావనైనా చస్తాను గానీ కవితలల్లకుండా ఉండలేను" అంటాడు మెక్సికన్ కవి ఆక్టావియోపాజ్.

కవిత్వాన్ని కవిత్వంతో ప్రేమించకపోతే ఇక నువ్వు కవిత్వంతో దేన్ని ప్రేమించగలవ్? అంటాడు దక్షిణ కొరియా కవి చోంగ్ హ్యాన్ – జోంగ్.

'కవిత్వం ప్రజల మానసిక ఆహారమని గట్టిగా నమ్మినవాణ్ణి" అని ప్రకటించుకున్నాడు సిరియా కవి ఖబ్బానీ. 'ప్రపంచం నానిన వంట చెరకు' – 'జ్ఞాపకం ఈ జీవితపు చేతి వేలికి బిగుతై ఇబ్బంది పెట్టే ఉంగరం" అని స్త్రీవాద కవయిత్రి అమృతాప్రీతం అంటారు. దళిత స్పృహ – హిందీ తెలుగుల మధ్య వారధి (పేజీ 31), తెలుగులో హిందీ కవి మిత్రులు (పేజీ. 36), మధుశాల అనువాదం, ఇతర భాషల్లో తెలుగు కవిత్వం (పేజీ. 53), 'స్థాయి లేని మినీ కవితకు కొత్త పేరెందుకూ?" (పేజీ. 81), మేనేజర్ల నుండి సాహిత్యాన్ని రక్షించండి (పేజీ 90), ఒక సాహితీ యాత్ర : 'కాలికట్ నుండి తిరుపతి" (పేజీ98) వ్యాసాలు... పాఠకులకు సాహితీ స్పృహ పెంచుతాయి. ఎన్నో ఆసక్తికర సాహితీకారుల సాహిత్యాన్ని, వాదాలను... ఒక చోట చూడగలం. కవులకు ఇది చక్కటి కరదీపిక.

- తంగిరాల చక్రవర్తి

పుదీనాతో పసందు

పుదీనా ఘోష్

కావలసినవి : మటన్ ముక్కలు: పావుకేజీ, పుదీనా ఆకులు : కప్పు, కొత్తిమీర : ఒక కట్ట, ఉల్లిపాయ : ఒకటి పెద్దది (ముక్కల్లా తరగాలి), పచ్చిమిర్చి: నాలుగు, నూనె : రెండు టేబుల్ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్టు : ఒకటిన్నర చెంచా, పెరుగు : పావు కప్పు కన్నా కొద్దిగా తక్కువగా, ఉప్పు : సరిపడా, గరంమసాలా : చెంచా.

తయారీ విధానం : ఓ గిన్నెలో మటన్ ముక్కలూ, సగం అల్లం వెల్లుల్లి పేస్టూ, తగినంత ఉప్పు వేసుకుని బాగా కలిపి కుక్కర్‌లో ఉంచాలి. మటన్ మెత్తగా అయ్యే వరకూ ఉడికించుకుని తీసుకోవాలి. ఇప్పుడు పుదీనా, కొత్తిమీరను మిక్సీలో వేసి, మెత్తని పేస్టులా చేసుకోవాలి. అలాగే ఉల్లిపాయలూ, పచ్చిమిర్చిని కూడా సన్నగా తరిగి పెట్టుకోవాలి. బాణలిలో నూనె వేడిచేసి ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కల్ని వేయించుకోవాలి. అవి వేగాక మిగిలిన అల్లంవెల్లుల్లి పేస్టూ, పుదీనా పేస్టూ వేసేయాలి. రెండు నిమిషాల తరవాత అందులో గిలకొట్టిన పెరుగూ, గరంమసాలా, ఉడికించిన మటన్ ముక్కలూ వేసి మంట తగ్గించేయాలి. కావాలనుకుంటే ఇంకొంచెం ఉప్పు కూడా వేసుకోవచ్చు. పదిహేను నిమిషాలకు కూర తయారవుతుంది. అప్పుడు దింపేయాలి. ఇది అన్నంలోకే కాదు, రొట్టెల్లోకి బాగుంటుంది.

పుదీనా రైస్

కావలసినవి :

బాసుమతి రైస్: 2 కప్పులు, పుదీనా ఆకులు : 3 కప్పులు, పచ్చి బఠాణీలు :1 కప్పు, అల్లం, వెల్లుల్లి: కొంచెం, పచ్చిమిర్చి : 5, లవంగాలు – 5, చెక్క: చిన్నముక్క, జీడిపప్పు పలుకులు : అరకప్పు, నెయ్యి : 6 స్పూన్స్, ఉల్లిపాయ ముక్కలు : 1 కప్పు (సన్నగా కట్ చేసినవి).

తయారు చేసే విధానం :ముందుగా పుదీనా, పచ్చిమిర్చి, అల్లం వెల్లులి, లవంగం, చెక్కని మిక్సీలో వేసి పేస్టులాగా చేసి పక్కనపెట్టాలి. బియ్యం కడిగి ఒకటిన్నర కప్పు నీళ్లు పోసి పెట్టాలి. మూకుడు వేడి చేసి అందులో కొంచెం నెయ్యి వేసి ఉల్లిముక్కలను కొంచెం వేయించాలి. తరువాత పుదీనా పేస్టుని, పచ్చి బఠాణీలను వేసి వేయించి ఈ మిశ్రమంలో బియ్యం వేసి బాగా కలిపి ఉప్పు కూడా వేసి స్టవ్ మీద పెట్టి ఉడకనివ్వాలి. అందులో వేయించిన జీడిపప్పు, ఆ తరువాత పుదీనా ఆకుల్ని కూడా వేయించి ఉడికిన అన్నంలో వేసి బాగా కలపాలి. ఇది వెరైటీగా ఉంటుంది.

కొబ్బరి పుదీనా చట్నీ

కావలసినవి : పచ్చి కొబ్బరి : 1 కప్పు, పుదీనా : ఒకటిన్నర కప్పు, పుట్నాలపప్పు : అరకప్పు, పుల్లటి పెరుగు: అరకప్పు, పచ్చిమిర్చి :6, ఉప్పు : తగినంత. పోపుగింజలు: ఆవాలు, మిరపకాయలు.

తయారు చేసే విధానం : ముందుగా పుట్నాల పప్పుని గ్రైండ్ చేసి అందులో కొబ్బరి, పుదీనా, ఉప్పు, పచ్చిమిరప వేసి గ్రైండ్ చేయాలి. చివరగా పెరుగుని వేసి గ్రైండ్ చేసి అన్నీ మెత్తగా అయ్యాక ఒక గిన్నెలోకి తీసి పోపు వేసి కలపాలి. ఇది ముద్దగా ఉంటే కొంచెం నీళ్లు కలపాలి. ఈ చట్నీ ఇడ్లీ, దోసె, ఊతప్పం, వడలు లాంటి వాటితో చాలా బావుంటుంది.

నిల్వ చట్నీ

కావలసినవి : పుదీనా : 6 కట్టలు, చింతపండు రసం : 1 కప్పు (చిక్కనిది), నూనె : అరకప్పు, ఎండుమిర్చి : 12, ఉప్పు, పసుపు, తగినంత, మినప్పప్పు, శనగపప్పు, ఆవాలు, మెంతులు : అన్నీ ఒక్కొక్క స్పూను.

తయారు చేసే విధానం : ముందుగా పుదీనా ఆకును శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. చింతపండు రసాన్ని ఐదు నిమిషాలు ఉడికించాలి. తరువాత మూకుడు వేడి చేసి 4 స్పూన్ల నూనె వేసి అందులో పోపుగింజలు, మిరపకాయలను వేసి వేయించి పక్కన పెట్టాలి. ఇప్పుడు 5 స్పూన్ల నూనె వేడి చేసి ఆకును వేయించాలి. తరువాత పోపును మిక్సీలో వేసి పొడి చేసి ఆకును వేసి ఉప్పు, పసుపు, చింతపండు రసం వేసి అన్నింటినీ గ్రైండ్ చేయాలి. తరువాత దీనిని ఒక బౌలులోకి తీసుకుని 5 స్పూన్ల నూనె వేడి చేసి ఈ మిశ్రమంలో వేసి బాగా కలపాలి. ఇది ఒక నెల నిల్వ ఉంటుంది. అన్నంలో మంచి వెరైటీగా బావుంటుంది. ఇది దోసెల్లాంటి వాటిలోకి బావుంటుంది.

పుదీనా రాజ్మా బిర్యానీ

కావలసినవి : బియ్యం : అరకిలో, ఉల్లిపాయ: ఒకటి, పచ్చిమిర్చి : నాలుగు, నూనె : 50 గ్రాములు... దాల్చిన చెక్క : రెండు అంగుళాల ముక్క, ఉప్పు :తగినంత, పుదీనా : ఒక కట్ట, రాజ్మా గింజలు : 50 గ్రాములు, అల్లంవెల్లుల్లి : రెండు టేబుల్ స్పూన్లు, లవంగాలు : నాలుగు, కొత్తిమీర : కప్పు.

తయారుచేసే విధానం : రాత్రి పడుకునే ముందు రాజ్మా గింజల్ని నానబెట్టాలి. ముందుగా బియ్యం కడిగి పెట్టుకోవాలి. పుదీనా ఆకును తుంచి శుభ్రంగా కడిగి మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. వెడల్పాటి బాణలిలో నూనె, నెయ్యి వేసి కాగాక లవంగాలు, దాల్చినచెక్క వేసి వేయించాలి. తరువాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, రాజ్మా గింజలు, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి వేయించాలి. ఇవి వేగాక పుదీనా ముద్ద వేసి దోరగా వేయించి తగినన్ని నీళ్లు పోసి ఉప్పు వేయాలి. నీళ్లు మరిగిన తరువాత కడిగి పెట్టిన బియ్యం వేసి ఉడికించి దించాక కొత్తిమీరతో అలంకరించాలి.

జత చేయండి!



హాయ్ పిల్లలూ ఇక్కడ కొన్ని పక్షులున్నాయి కదా! కానీ వాటికి ముక్కులే లేవు. ఆ పక్షులకు తగ్గ ముక్కులు రౌండ్ సర్కిల్‌లో ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి ఆ పక్షులకు జతచేయండి.

పద బంధం



ఈ బొమ్మల ఇంగ్లీష్ పేర్ల మొదటి అక్షరాన్ని పక్కన ఉన్న గడిలో రాయండి. గడుల అక్షరాలన్నీ కలిపితే ఒక పదం వస్తుంది. అదేంటో చెప్పుకోండి.

జవాబు:
Cap + Hut + Apple +Ice cream + Rat = Chair.

క్రేజీ క్రికెటర్



పొడుపు కథ

ఆకాశంలో అరవై గదులు

గదిగదికి సిపాయి ఒకడు

సాపాయికొకనికి

తుపాకి ఒకటి

జవాబు : తేనెతుట్టె

రంగులేద్దామా!

బొమ్మలతో గణితం

పిల్లలూ మీకు లెక్కలు బాగా వచ్చు కదా...! ఇక్కడ మేం కింద ఇచ్చిన బొమ్మలు, వాటి అంకెలను బట్టి ఈ లెక్కలను పూర్తి చేయండి. అలా చేసిన తర్వాత మా జవాబులతో సరి చూసుకోండి.



జవాబు:
2+6+8 = 16
10-1+4 = 13
5+9-3 = 11

పదానికి పదండి!

దారి చివరన ఉన్న బొమ్మను చేరాలంటే మీరు వెళ్లే దారిలో వచ్చే బొమ్మల పేర్ల మొదటి అక్షరాలను కలపాలి. ఇంతకీ ఆ బొమ్మను చేరే మార్గం కనుక్కున్నారా?



జవాబు: Mouse

తేడాలేంటి?



ఇక్కడున్న ఒకే రకమైన రెండు బొమ్మలలో 5 తేడాలున్నాయి. అవి ఎక్కడ ఉన్నాయో చూసి సున్నా చుట్టేయండి.

పంటికి పాచి ఒంటికి మురికి బలమా?

యెల్లో ఎల్లో ...డర్టీ ఫెల్లో అంటూ పండ్లు సరిగా తోము కోని వారిని పరభాషలో పరాభవించటం ఏదో ఒక సందర్భంలో మీరు వినే ఉంటారు. ఎవరైనా పండ్లు ఎందుకు తోముకోరంటే దానికీ తగిన కారణాలను వారు చెబుతారు. పంటికి పాచి, ఒంటికి మురికి బలము అని మనస్ఫూర్తిగా నమ్మబట్టే పండ్లు తోముకోకుండా, సరిగా స్నానం చేయకుండా నిష్టతో వాటిని పాటిస్తుంటారు.

పిల్లల గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రతి క్షణాన్ని ఆటకు కేటాయించాలని పుట్టగానే అర్ధం చేసుకున్నారు గనుక పండ్లుతోమాలన్నా, స్నానం చేయించాలన్నా మారాం చేస్తారు. కొందరు పండ్లు తోముకొనేందుకు వేప పుల్లలను వినియోగిస్తారు. మరికొందరు పండ్ల పొడి, మరికొందరు బొగ్గు పొడి, ఇంకొందరు ఉప్పు, పేస్టు ఇలా ఎంతో వైవిధ్య భరితంగా పండ్ల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కొందరు బ్రష్‌ను పైకీ కిందికి రుద్దుతారు, కొందరు ఆ వైపు ఈవైపు తోముతారు, కొందరు రెండు పద్దతులూ పాటిస్తారు. వేప పుల్లతో నోరంతా తిప్పుతారు. పళ్ల ముందు లోపలా తోముతారు. వీటన్నింటి మీద టీవీలలో వచ్చే వాణిజ్య ప్రకటనలు కూడా ఎంతో వినోదాన్ని కలిగిస్తాయన్నది వేరే విషయం. వాటిని త్రికరణ శుద్ధిగా నమ్మి అమ్మాయిలు క్లోజ్ అవుతారని అబ్బాయిలు, అబ్బాయిలు అవుతారని అమ్మాయిలు ప్రత్యేక టూత్ పేస్టులను వాడి ఎప్పటి కప్పుడు తమ నోళ్లను పరీక్షించుకునేవారూ లేకపోలేదు.

పత్రికల్లో కాఫీ తాగితే వచ్చే హాని గురించి కొందరు రాస్తే టీ తాగితే తలెత్తే సమస్యల గురించి మరికొందరు రాస్తారు. నిజంగా వాటిని దగ్గర పెట్టుకొని చదివితే రెండూ మానివేయాలన్నంత తెగింపు మనకు కలగటం సహజం. అయినా రాసే వారు అలా రాస్తూనే ఉంటారు, మన పని మనం కానిద్దాం అనుకొని ఆచరణలో పెట్టేవారినే మనం ఎక్కువగా చూస్తాం. ఇంతకీ ఈ సందర్భం ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందంటే పేస్ట్, బొగ్గు పొడి, పళ్ల పొడి దేన్నయినా ఉపయోగించండి అది వేరే విషయం. అసలు పళ్లే పద్ధతిలో తోముకోవాలన్నది ఇప్పటికీ మానవాళికి తెలియని రహస్యాలలో ఒకటిగా, ఏకాభిప్రాయం లేని అంశాలలో ఉందని కొందరు చెబుతున్నారంటే మీరు అంగీకరిస్తారా?

అదే స్కూలు, కాలేజీలైతే వివిధ పద్దతులను అనుసరించే వారిని జట్లుగా చేసి వారి వారి సమర్ధనలను సభ ముందుంచమంటారు. అలాంటి కార్యక్రమాలెంతో మజానిస్తాయి. లండన్ విశ్వవిద్యాలయ కళాశాల వారు బ్రిటీష్ డెంటల్ జర్నల్‌లో వెల్లడించిన అధ్యయన అంశాల ప్రకారం ప్రస్తుతం మీరు ఎలా బ్రష్ చేసుకుంటున్నప్పటికీ ఆందోళన చెందనవసరం లేదు. ఎందుకంటే ఏ పద్ధతి సరైనదో ఎవరూ నిర్ధారించలేకపోతున్నారు గనుక నా పళ్లు, నా బ్రష్ నా యిష్టం అంటూ మీ పద్ధతే సరైందని మీరు ధైర్యంగా తోముకోవచ్చు. పండ్లుతోముకొనే పద్ధతుల గురించి పంటి వైద్యులు, పేస్టులను తయారు చేసే కంపెనీలు భిన్నంగా చెబుతున్నాయని ఆ సర్వేలో తేలింది. పది దేశాలలో ఉన్న పేస్ట్, బ్రష్‌ల కంపెనీలు చెప్పిన అంశాలు, పండ్లకు సంబంధించి పాఠ్య పుస్తకాలను తులనాత్మకంగా పరిశీలించి పైన పేర్కొన్న నిర్ధారణకు వచ్చారట. పాఠ్యపుస్తకాలు, డెంటల్ అసోసియేషన్ల మధ్య ఏకాభిప్రాయం లేకపోవటం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.

'పండ్లను తోముకొనేందుకు ఏది ఉత్తమ పద్ధతి అన్న మంచి సమాచారం పౌరులకు అవసరమని' లండన్ విశ్వ విద్యాలయ కాలేజీ కి చెందిన ప్రజారోగ్య ప్రొఫెసర్ అబరే షెయిహామ్ అంటారు. టూత్ బ్రష్‌ల కంపెనీ ఒక పద్ధతి చూపితే, డెంటిస్టులు మరొక పద్ధతిని సిఫార్సు చేస్తుండటంతో తోము కొనే వారు గందరగోళ పడిపోతున్నారని ప్రొఫెసర్ అంటున్నారు. ఎక్కువగా సిఫార్సు చేస్తున్నదాని ప్రకారం మెల్లగా పైకీ కిందికీ, ఆ వైపు, ఈవైపు తోముకోవటం. కొంత మంది బ్రష్ స్థిరంగా పట్టుకొని నలువైపులా తలతిప్పేవారు కూడా ఉండవచ్చు అది వేరే విషయం. అయితే బ్రష్‌తో పండ్లు తోమటం, లేకుండా తోముకోవటానికి పెద్దగా తేడాలేమీ లేవని అధ్యయనాలు తేల్చాయి. చిగుళ్లు పగిలి రక్తం కారేలా, బ్రష్‌ను గట్టిగా రుద్దటం వలన ప్రయోజనం లేదని కూడా వెల్లడైంది.

కొంత మంది తీపి పదార్ధాలు లేదా పంచదార పానీయాలు తాగిన తరువాత దంతక్షయాన్ని నిరోధించేందుకు బ్రష్ చేసుకొంటారు. దాని వలన ఉపయోగం లేదని తేలిందట. ఎందుకంటే మన శరీరంలో ఉన్న బ్యాక్టీరియా మనం ఆహారం తిన్నా, పానీయం తాగినా రెండు నిమిషాల్లోనే ఆమ్లాలను విడుదల చేయటం ప్రారంభిస్తాయట. అందువలన ఆ తరువాత బ్రష్ చేసినా ప్రయోజనం లేదని అప్పటికే పళ్ల ఎనామిల్‌కు జరగాల్సిన హాని జరుగుతుందని పరిశోధనల్లో తేలిందట. చిగుళ్లు-పండ్లు కలిసే చోట బాక్టీరియా, తిన్న పదార్థాల ముక్కలు చేరి పాచి పేరుకుపోకుండా చూసుకోవటం ముఖ్యం. సులభ పద్దతిలో పండ్లు తోముకున్నా అది జరుగుతుంది. అటువంటి ప్రాంతాలన్నింటినీ తోముకోవటం ముఖ్యం. కొందరు రోజుకు రెండుసార్లు పళ్లు తోముకుంటారు. అయితే అది అవసరమా లేదా అన్నది డెంటిస్టులు స్పష్టంగా చెప్పాలి. అసలు ఏ విషయమైనా ఒక ఏకాభిప్రాయం లేకపోతే బద్ధకిస్టులు అసలు మొదటికే మోసం తెచ్చినట్లుగా నిర్ధారణ అయిన తరువాతే పళ్లుతోముకుంటామని చెప్పే ప్రమాదం ఉంది కనుక అలాంటివారికి దీన్ని చదివే అవకాశం లేకుండా చేస్తే మంచిదేమో !

- సత్య